కర్నూలు | నంద్యాల
వార్త
I డిసెంబర్, 2024 ఆదివారం పేజీలు 4

## సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి : జిల్లా కలెక్టర్

**నంద్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త ప్రతినిధిః** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు జి రాజకుమారి సంబంధిత అధికారులను అదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన ఓరియేంటేషన్ కార్యక్రమంలో కలెక్టరు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణుచరణ్, డిఆర్వో రామునాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని సంబంధిత అధికారులను అదేశించారు. డిసెంబర్ 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడుతుందన్నారు. డిసెంబర్ 8న ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. కెసి కాల్వ కింద 52, ఎస్ఆర్‌బిసి కింద 50, తెలుగుగంగ కింద 47, శివబాష్యం ప్రాజెక్టు కింద 7, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 104, మైలవరం కింద 1 వెరసి మొత్తాన్ని 261 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఓటర్ల జాబిత సంబంధిత తహశీల్దారుల నుండి తీసుకోవాలన్నారు. ఓటింగ్ నిర్వహించే ప్రదేశాన్ని రైతులందరికి తెలిసేలా విస్తృత పబ్లిసిటి ఇవ్వాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నికల ప్రక్రియ కూడ అదేరోజు జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడిఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంతోనే.. అభివృద్ధి సాధ్యం..!

**ప్యాపిలి నవంబరు30 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల ఎమ్పీ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిలు అన్నారు. ప్యాపిలి పట్టణంలోని సబ్ పోస్టాఫీసు కార్యాలయానికి 40లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి శనివారం వారు భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దె భవనంలో నడుస్తున్న పోస్టాఫీసుకు నూతన భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాలు నిరంతర ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నాయని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను నేరవేరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందిస్తామన్నారు. పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టాల్‌శాఖ అమలు చేస్తున్న పొదపు పథకాలలో చేరి భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజియన్ పోస్టు మాస్టర్ జనరల్ వెంకం ఉపేందర్, అధికారులు, పిఎంజి ఉపేంద్ర, పిఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, డోన్ డివిజన్ పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం మల్లన్న క్షేత్రంపై.. కూటమి మాటేంటి..?

- రెగ్యూలర్ ఈఓను నియమించకపోవడంలో అంతర్యం ఏమిటి...!
- పూర్తి అదనపు బాధ్యతల అధికారే షురునా...!

**అష్టధశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మల్లన్న మహాపుణ్యక్షేత్రంపై కూటమి ప్రభుత్వం మాటేంటి..? అన్నది చర్చానీయాంశంగా మారింది. ఏపి ప్రభుత్వం శ్రీశైలదేవస్థానంను తిరుమల - తిరుపతి తరహాలో అభివృద్ధి చేస్తామంటున్నప్పటికి దేవస్థానం పాలనపరమైన అంశాలలోకి వచ్చె సరికి రెగ్యూలర్ ఈఓను నియమించకపోవడంలో కూటమి ప్రభుత్వం అంతర్యం ఏమిటి..? అన్న పలు సందేహాలు రెకిత్తిస్తున్నాయి. పూర్తి అదనపు భాధ్యతల అధికారితోనే క్షేత్రంను కాలం వెల్లబుచ్చుతారా..? అన్న గుసుగుసలు క్షేత్రంలో వినబడుచున్నాయి.**



**నంద్యాల,నవంబర్30, ప్రభాతవార్త ప్రతినిధి :** ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ నెల 09వ తేదిన సాక్ష్యత్తు శ్రీశైలమల్లన్న దర్శనార్థం వచ్చి క్షేత్రపరిస్థితు లను అన్నింటిని దేవదాయశాఖ ఉన్నాతాదికారులతో అడిగితెలుసుకున్నారు. అయన పర్యటన సమయంలో కూడా రెగ్యూలర్ ఈఓ శ్రీశైలక్షేత్రంకు లేదని తెలుసు. శ్రీశైలక్షేత్రంకు మల్లన్న దర్శనార్థం దేశ, విదేశాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యాలో వస్తుపోతుంటారు. రెగ్యూలర్ ఈఓగా ఉన్న పెద్దిరాజును బదిలీ చేస్తు అసిస్టేంట్ కమీషనర్ హోదాల ఉన్న అధికారికి ఈఓ భాధ్యతలు నిర్వర్తించమని అప్పగించారు. ఈక్రమంలో అయన నియామకంతో వైసిపి అధికారికి అందలం అని పత్రికల్లో శీర్షికలు కూడా ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటన అనంతరం శ్రీశైల దేవస్థానంకు ఓ ఐ.ఎ.ఎస్. అధికారి హోదాలో ఉన్న అదికారిని కాని, లేక రెగ్యూలర్ ఈఓను కాని నియమిస్తారని క్షేత్ర ఉధ్యోగులు, భక్తులు, క్షేత్రవాసులు అశలు పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వం ఉన్నఫలంగా దేవదాయశాఖలో తిరుపతి రిజనల్ జాయింటు కమీషనర్‌గా కొనసాగుతున్న ఎస్.ఎస్. చంద్రశేఖర అజాద్‌కు శ్రీశైలదేవస్థానంకు పూర్తి అదనపు భాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి.నెం.823 ను విడుదల చేసింది. శ్రీశైలక్షేత్రం ఒక పర్యాటక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి తన పర్యటనలో మీడియాతో వెల్లడిపరిచారు. భక్తుల సౌకర్యార్థం అమలు పరచాల్సిన మాస్టర్ ప్లాన్, క్షేత్రంలో జరగాల్సిన అబివృద్ధి పనులు పెద్ద ఎత్తున ఉన్నాయి. శ్రీశైలంకు రెగ్యూలర్ ఈఓను నియమించక పోవడంలో ప్రభుత్వం అంతర్యం ఏమిటని క్షేత్రవాసుల్లో, ఉద్యోగుల్లో ప్రశ్నార్థకంగా మారింది. నవంబర్ నెల 29వ తేదిన రాష్ట్రంలో డ్యూప్యూటి కలేక్టర్ల బదిలీలను ప్రభుత్వం మార్పులు చేర్పులు చేయడం జరిగింది. ఈ నేపధ్యాంలోనే ఏపి మెడికల్ సర్వీసెస్‌లో విధులు నిర్వర్తిస్తున్న యం.శ్రీనివాసరావును శ్రీశైలదేవస్థానం కు నూతన ఈఓ గా నియమించడం జరిగిందని ప్రభుత్వం విడుదల చేసిన డ్యూప్యూటి కలేక్టర్ల బదిలీ ఉత్వర్వులలో పేర్కనడం జరిగింది. ఉత్తర్వులు వెలువడిన కొన్ని క్షణాల్లోనే నియామకాల్లో మార్పులు చోటు చేసుకోవడంపై శ్రీశైల క్షేత్రంకు ఈఓ నియమకాల్లో ప్రభుత్వం ఎందుకు సరియైన నిర్ణయం తీసుకోవడంలేదన్న వాదనలు కూడా ఊపందుకు న్నాయి. పర్యటక అబివృద్ధి మంత్రం పాటించే ప్రభుత్వం క్షేత్ర పాలనపరమైన అంశాలల్లో కూడా రెగ్యూలర్ ఈఓను నియమిస్తే బాగుటుందని భక్తులు కోరుతున్నారు.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

– ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**జూపాడుబంగ్లా, నవంబర్ 30, ప్రభాతవార్త** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటవ తేదినే ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో శనివారం ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లు పంఫిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాగనే పింఛను మూడు వేల నుండి నాలుగు వేలకు పెంచడం, పింఛన్లు ప్రతి నెల మొదటి తారీకునే అందజేయడం పట్ల లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికి వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మకులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులకు సామాజిక భద్రత పింఛన్ల మొత్తాన్ని పెంచుతూ జివో జారీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజు, తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపిడిఓ గోపిక కృష్ణ, సర్పంచ్ మోటు బాలయ్య, రాష్ట్ర యాదవ్ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్ల యాదవ్, మండల నాయకులు గిరీశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, జంగాల పెద్దన్న, రవికాంత్, రవియాదవ్, సుధాకర్, రమణారెడ్డి, ఎంపిటిసి కృపాకర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## రసాబసాగా కౌన్సిల్ సమావేశం

– కుర్చీల కోసం వైస్ చైర్మన్ వాగ్వివాదం



**ఆదోని,నవంబరు 30,ప్రభాతవార్త** మున్సిపల్ చైర్మన్ శాంత అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాబసాగా కొనసాగింది. ఈ సమావేశంలో కుర్చీల కోసం గత మూడు నెలల నుంచి వైసిపి వైస్ చైర్మన్లు,వైసిపి కౌన్సిలర్లు వాగ్వివాదం చేస్తున్నారు. ప్రజాసమస్యలను వైస్ చైర్మన్లు,కౌన్సిలర్లు పట్టించుకోకుండ గత మూడు నెలల నుండి కుర్చీల కోసమే వాగ్వివాదం చేస్తున్నారు. వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు చైర్మన్ పోడియం ముందు నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కౌన్సిలర్లు హాజరు కాకుండ అజెండాలో పాస్ చేసి బిల్లులు పెట్టుకునేవారు గత మూడు నెలల నుంచి అజెండాలను వాయిదా వేస్తూ ప్రతి సమావేశానికి అడ్డంగా వైసిపి కౌన్సిలర్లు సమాధానం చెబుతున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశానికి కుర్చీలు లేవంటూ నిరసనలు చేస్తూ సమయాన్ని వృధా చేస్తున్నారు. అయితే ఎట్టకేలకు కౌన్సిల్ సమావేశం అజెండాలో 70అంశాలను ప్రవేశపెట్టగా అందులో 15అజెండాలను అలాగే 35జెండాలను వినిపించారు. అనంతరం కౌన్సిలర్లు ఈ సమావేశంలో కింద కూర్చోవాలంటే అనారోగ్యంగా ఉన్నవారు ఉన్నారని అందుకోసమే ఎమర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేయాలని సభ నుంచి బయటకి వెళ్లిపోయారు.

## ఒకరోజు ముందుగానే పింఛన్‌ల పండుగ

– టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి



**రచ్చుమర్రి(మంత్రాలయం),నవంబర్ 30,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న అవ్వాతాతలు ఒకరోజు ముందుగానే పింఛన్‌ల పండుగ చేసుకున్నారని మంత్రాలయం టిడిపి ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో అర్హులైన వారికి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకరోజు ముందుగానే పింఛన్‌లను పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా పింఛన్‌లు, ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందిస్తున్నట్లుతెలియజేశారు. కావున ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్‌లను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విష్ణువర్దన్‌రెడ్డి టిడిపి నాయకులు పోలి వీరేష్, శివ, శ్రీనివాసులు, తిమ్మప్ప, యాగంటి ఈరన్న, బంగారయ్య, ఉసేని, హనుమంతు, చావడి వెంకటేష్, లక్ష్మయ్య, జనసేన నాయకులు యేసేపు, నరసింహులు, చిదానంద, బాలరాజు, రాముడు, ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని నియోజకవర్గం అభివృద్ధి చెందేనా..!

- రాజులు ఏలిన రాజ్యం మన ఆదోని
- ట్రాఫిక్ సమస్యతో అవస్థలు
- నాయకులు ఇచ్చిన వాగ్దానాలలో నిజం ఎంత..?



**ఆదోని అర్బన్,నవంబరు 30, ప్రభాతవార్త:** ఎంతోమంది రాజులు,నవాబులు పాలించి,నివాసం ఉన్న ప్రాంతం ఆదోని ప్రాంతం ఇందుకు నిదర్శనమే రాజులు,నవాబులు కట్టించిన పురాతనమైన కట్టడాలు ఇప్పటికీ మనం ఆదోని నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో చూడవచ్చు. తదనంతరం ఆదోని నియోజకవర్గం పరిశ్రమలకు పెట్టిన పేరుగా గుర్తింపు పొంది రెండవ ముంబాయిగా పేరుగాంచింది. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు,నాయకులు వారి స్వార్థం కోసం పరిశ్రమలే లేకుండా చేశారు అనే వాదన ఇప్పటికీ గట్టిగా వినిపిస్తుంది. ఆదోని నియోజకవర్గం ఎంతో ప్రసిద్ధిగాంచిన ప్రాంతమైనా అభివృద్ధి చెందడంలో మాత్రం అన్నిటికన్నా వెనుకబడిన నియోజకవర్గం అని విశ్లేషకులు చెప్పకనే చెబుతున్నారు. రాజులు ఏలిన రాజ్యమైన..రాజులు రాజభోగాలు..అనుభవించిన ప్రాంతమైన అభివృద్ధికి నోచుకోవడంలో మాత్రం కొంతమంది నాయకుల స్వార్థపాలనతో ఎంతో వెనుకబడి ఉంది. 100ఏళ్ల చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీలో ఇప్పటికీ రహదారులు కూడా సరిగా లేవు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇందుకు కారణం ఎవరు అని ఎవరిని అడిగినా నాయకులే అని సమాదానం ప్రజల నుండి గట్టిగా వినబడుతుంది. ప్రతి ఎన్నికలలో రాజకీయ నాయకులు వచ్చి అది చేస్తాం..ఇది చేస్తామని..వాగ్దానాలు ఇచ్చినా వాటిని నిలబెట్టుకోవడంలో మాత్రం ఏ నాయకుడు ప్రయత్నించడం కూడా లేదనే వాదనలు గట్టిగా వినబడుతున్నాయి. ప్రజా నాయకులు, ప్రజాసంఘాలు అంటూ అప్పట్లో కొంతమంది వారి స్వార్థం కోసం యూనియన్ల పేరు చెప్పుకుంటూ నిత్యం ధర్నాలు,నిరసనలు చేస్తూ పరిశ్రమలకు నష్టం వచ్చే విధంగా చేయడం వలన ఆదోని ప్రాంతంలో పరిశ్రమలే లేకుండా పోయాయని మరికొందరు చెబుతున్నారు. అప్పటి నుండి ఆదోని ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదని వచ్చిన ప్రతి నాయకుడు దోచుకుందాం.. దాచుకుందాం..అనే రీతిలో పనిచేస్తున్నారే తప్ప ఆదోని నియోజకవర్గం అభివృద్ధి చేద్దాం అనే ఆలోచన ఒకరికి కూడా సరిగా లేదని ఏది చేసినా పూర్తికాని పనులే తప్ప పూర్తి చేసిన పనులు ఏవీ లేవని ఇదేమిటని అడిగేసరికి మా ప్రభుత్వం ఇప్పుడు లేదని ఇప్పుడున్న ప్రభుత్వం చేయడం లేదని చెప్పడమే తప్ప ఏ నాయకుడు చిత్తశుద్ధితో పనిచేసిన దాఖలాలు లేవని మరికొందరు చెబుతున్నారు. ఆదోని ప్రాంతంలో విస్తారమైన రోడ్డు లేక ట్రాఫిక్ సమస్యతో పురప్రజలు నానా అవస్థలు పడుతున్నా ఎన్నికల ముందు రోడ్లు వెడల్పు చేస్తాం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తాం అంటూ చెబుతూనే ఉన్నారు తప్ప ఏ ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయలేదని పట్టణంలో కొన్నిచోట్ల డివైడర్లుకూడా లేవని పక్కనే ఉన్న ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎంత అభివృద్ధి చెందిందో..?ఇక్కడున్న నాయకుడు చూసి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పుడున్న నాయకులైనా చిత్తశుద్ధితో పనిచేస్తూ ఆగిపోయిన మెడికల్ కాలేజ్ పనులను మరియు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మొదలు పెట్టి రోడ్లను విస్తరింపచేసి ఆదోని అభివృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత ఇప్పుడున్న ఎమ్మెల్యేపై ఉందని ఆ నమ్మకంతోనే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని అలా చేయని పక్షంలో మరల ప్రజలు అవకాశం కూడా ఇవ్వరని తెలియజేస్తున్నారు. మరికొందరైతే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే మాటలే తప్ప ఫలితం చూపించడం లేదనే ఆరోపణలు చేస్తున్నారు. పక్కనున్న నాయకుల అవినీతి బాగోతాలు బయటపడుతున్నా చూసి చూడనట్లుగా నడుచుకోవడం కూడా సరికాదని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులను ప్రోత్సహించకుండ ఆదోని నియోజకవర్గం అభివృద్ధి చెందేందుకు పెద్దఎత్తున ప్రభుత్వం నుండి నిధులు తెచ్చుకుని ఆదోని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఎన్టీఆర్ భరోసా.. పెన్షన్ల పంపిణీ

**లబ్ధిదారుల ఇంటి వద్ద సామాజిక భద్రత పెన్షన్లను అందజేసిన జిల్లా కలెక్టర్**

**కర్నూలు, నవంబర్ 30, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2 లక్షల 40 వేల 330 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.102.55 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం ఉదయం నగరంలోని జొహరాపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అచ్చమ్మ, లచ్చమ్మ లకు వృద్ధాప్య పెన్షన్, ప్రమీలమ్మ కు వితంతువు పెన్షన్, జ్యోతి కి ఒంటరి మహిళ పెన్షన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 1 వ తేది ఆదివారం కావడంతో ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. భరోసా పింఛను పథకం ద్వారా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు.. ఈ మార్గదర్శకాల ప్రకారం పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యాజమాని మరణిస్తే వెంటనే అతని భార్యకు వితంతు పింఛను మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కుటుంబ యజమాని మరణించిన వెంటనే అందుకు సంబంధించి తగిన డాక్యుమెంట్లు అప్లోడ్ చేస్తే, తదుపరి నెలలో అతని భార్యకు పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.. ఈ ఉత్తర్వులు 01.11.2024 తేదీ తర్వాత మరణించిన వారికి మాత్రమే వర్తిస్తాయని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు..అలాగే నూతన మార్గదర్శకాల ప్రకారం మొదటి నెలలో పెన్షన్ తీసుకోకపోయినా, 2వ నెలలో రెండు నెలల పెన్షన్ మొత్తాన్ని కలిపి ఇస్తారని, ఒకవేళ రెండు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా, మూడవ నెలలో మూడు నెలల పెన్షన్ మొత్తం కలిపి ఒకేసారి అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు..ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో కర్నూలు జిల్లా వరుసగా 4 సార్లు విజయవంతంగా మొదటి స్థానంలో నిలిచిందని, ఈ సారి కూడా జిల్లా మొదటి స్థానంలో ఉండే విధంగా పెన్షన్ పంపిణీ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డిఆర్డిఎ పిడి శివ నాగలీల తదితరులు పాల్గొన్నారు..



## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ

- మంత్రి ఆధ్వర్యంలో ఒక రోజు ముందుగానే లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ
- ఖాజీవాడలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి

**బనగానపల్లెరూరల్, నవంబర్30, ప్రభాతవార్త:** ఎన్డీయే కూటమి పాలనలో అటు సంక్షేమం ఇటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఖాజీవాడ ఏరియాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిసెంబర్ 1వ తేది ఆదివారం కావడంతో మంత్రి ఆధ్వర్యంలో ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఖాజీవాడకు చేరుకోగానే స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి లబ్దిదారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, మంచంమీద నుండి లేవలేని స్థితిలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వారి వద్దకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేశారు. అదే విధంగా ముస్లిం మైనార్టీలు ఎక్కువగా నివాసముండే ఖాజీవాడలో పర్యటించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి లబ్దిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థతో ఆ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను మంత్రి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో 6-8 అడుగులలోపే ఉన్న చిన్న ఇరుకైన వీధుల్లో ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఉండటాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గుర్తించారు. ఈ మేరకు డ్రైనేజీ వ్యవస్థను మధ్యభాగంలోకి తీసుకురావడం ద్వారా రోడ్డు విస్తీర్ణం పెరగడంతోపాటు డ్రైనేజీలో మురుగు నీరు సక్రమంగా పోవడానికి అవకాశం ఉంటుందని అధికారులకు సూచించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రచించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా గతంలో బనగానపల్లె ముస్లిం మైనార్టీ సోదరులకు ఇచ్చిన హామీ మేరకు అతి త్వరలో షాదిఖానాను నిర్మించి వారికి అంకితం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో షాదిఖానాకు శంకుస్థాపన చేసి అప్పటి నుండి మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సతీష్ కుమార్‌రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, రాయలసీమ సలాం, వెల్‌కమ్ అల్తాఫ్, టిప్‌టాప్ కలాం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**గోనెగండ్ల నవంబరు 30 ప్రభాతవార్త**

గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాలకుర్తి కి చెందిన యూసుఫ్ (52) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు ప్యాలకుర్తి గ్రామానికి చెందిన యూసుఫ్ శనివారం తన సమీపం బందువులు ఎమ్మిగనూరు పట్టణం నందు మృతి చెందారు. విషయం తెలుసుకొని దహనసంస్కారాలకు ఉదయం తన ద్విచక్రవామనంలో ప్యాలకుర్తి నుంచి ఎమ్మిగనూరుకు బయలు దేరాడు. గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామం శివార్ల దగ్గరకు రాగానే తన దిచక్రవాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో యూసుఫ్ రోడ్డుపై పడ్డాడు. తలకు చేతులకు తీవ్రగాయాల య్యాయి. రక్త స్రావం జరిగింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల పొలం వారు అక్కడికి వచ్చేలోపు కొలుకోలేక అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గోనెగండ్ల పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.



## ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి



**బనగానపల్లె, నవంబర్30, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పై శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లలిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ హెచ్ఐవీ మరియు ఎయిడ్స్‌ల పై విద్యార్థిని, విద్యార్థులకు రంగోలి ఉపన్యాస మానవహారం లాంటి ప్రత్యేక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఎయిడ్స్ అనేది ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య అని హెచ్ఐవీ అనే వైరస్ వల్ల వస్తుందని మరియు కలుషిత రక్తం ద్వారా అసురక్షిత లైంగిక కార్యకలాపాల ద్వారా ఎయిడ్స్ వస్తుందన్నారు. ఎయిడ్స్ కలిగిన తల్లి నుండి పిల్లలకు వ్యాపిస్తుందన్నారు. దేశంలోని యువత ఎయిడ్స్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉంటే వ్యాధిని దూరంగా ఉంచవచ్చన్నారు. వ్యాధి సోకిన వారి పట్ల దయ, ప్రేమ కబరిచి వారికి ఆర్థిక సహాయం చేయాలన్నారు. సమాజంలో చాలా మంది చిన్నపిల్లలు, మహిళలు ఈ వ్యాధి బారినపడి శారీరక, మానసిక రోగాలకు బలైపోతున్నారన్నారు. అందువల్ల యువత, ప్రజలకు అవగాహన కలి ్పంచాలన్నారు. అలాగే రెడ్‌రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.బడేసాహెబ్ మాట్లాడుతూ యువత హెచ్ఐవీ ఎలా వస్తుంది, నివారణ మార్గాల గురించి అవగాహన కల్పించడం వల్ల మాత్రమే దేశాన్ని ఎయిడ్స్ రహిత దేశంగా మార్చవచ్చన్నారు. ఎయిడ్స్ అంటే మరణంకాదని జీవితమన్నారు. యువత మాదకద్రవ్యాలకు లోనుకావడమనేది ఎయిడ్స్ వ్యాధిని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, రామన్న, రిషీశ్వరరుడు, చంద్రకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితా కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుంది

**కౌతాళంరూరల్, నవంబర్30, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన కౌతాళంలోని ఇంద్రనగర్‌లో హరిజన అంజి అనే వ్యక్తి హఠాత్తుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు బాధితా కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ తరపున ఆర్థిక సాయం అందించారు. ఎమ్మార్పీఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కౌతాళం పట్టణ అధ్యక్షులు ఎస్.ఆనంద్, ఉపాధ్యక్షులు ఉలిగయ్య, అదికార ప్రతినిధి శివకుమార్, ట్రెజరర్ రేవన్న, సహాయ కార్యదర్శి ఆనంద్, నాయకులు ఉన్నారు.

## వాటర్ మ్యాన్‌ను చెట్టుకు కట్టేయాలనడం ఎమ్మెల్యేకు తగదు

**– వైసీపీ కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఎస్.గోపాల్‌రెడ్డి**

**ఆదోనిలీగల్, నవంబర్30, ప్రభాతవార్త;** ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ముఖాముఖీ కార్యక్రమంలో స్థానికప్రజలతో మాట్లాడుతూ గ్రామంలో సరైన సమయంలో నీరు రావడంలేదని ప్రజలు విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే నీరు వదిలే వాటర్ మ్యాన్ చెట్టుకు కట్టేయాలని అనడం ఆయన స్థాయికి తగదని వైసీపీ కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఎస్.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక ఉద్యోగిని నలుగురిలో ఈ విధంగా మాట్లాడి అవమాన పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసనసభలో హుందాగా మాట్లాడి గౌరవాన్ని పెంచుకున్న మీరు నియోజకవర్గంలో ఈవిధంగా ప్రవర్తించడం వల్ల ప్రజల్లో మీ పట్ల అసహ్యభావం ఏర్పడుతుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా మీ వైఖరి మార్చుకోవాలన్నారు. ఎవరినీ ఉద్దేశించి ఇలాంటి భాష ఉపయోగించవద్దని హితవు పలికారు.

## జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకుంటే ఉన్నత అవకాశాలు మీ సొంతం

**ఆదోనిలీగల్, నవంబర్30, ప్రభాతవార్త;** జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకుంటే ఉన్నత అవకాశాలు మీ సొంతమవుతాయని జేఎస్‌పీ రాజ్‌శెట్టి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విద్యార్థులు వారి వారి జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలన్న విషయంపై స్థానిక రెడ్డీస్ ఫంక్షన్ హాలులో హైదరాబాద్‌కు చెందిన శేఖర్ ట్యూషన్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒత్తిడిని జయించడం ఎలా అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌పీ రాజ్‌శెట్టి హైదరాబాద్ వారి చేత విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. అద్భుతమైన జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలనే ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులకు స్పీడ్ మ్యాథ్స్ టిప్స్, పవర్‌ఫుల్ మెమోరీ, సీక్రెట్, హౌ టూ ఫోకస్ ఆన్ స్టడీస్, వాల్యూ ఆఫ్ పేరెంట్స్ అనే 5 అంశాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే యండమూరి వీరేంద్రనాథ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రాసిన నూరు టిప్పులు గెటుటాప్ ర్యాంక్ అనే పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలు ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యం

**– అవ్వతాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు నాయుడు**
**– ఆలూరు టీడీపీ నేత వైకుంఠం జ్యోతి**

**ఆలూరు రూరల్, నవంబర్30, ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని, ఇచ్చిన మాట ప్రకారం అవ్వతాతలకు పింఛన్లు పెంచి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఆలూరు టీడీపీ మహిళ నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం ఆలూరు పట్టణంలో ఉరుకుంద ఈరన్న కాలనీలో సర్పంచ్ అరుణాదేవితో కలిసి ఆమె సచివాలయ సిబ్బంది ద్వారా అవ్వతాతలకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష హోదాలో చంద్రబాబు నాయుడు అవ్వతాతలకు పింఛన్లను రూ.4వేలు ఇస్తామని చెప్ ్ప ముఖ్యమంత్రి అయ్యాక పింఛన్లను పెంచి మాట నిలబెట్టుకున్నారని ఆమె అన్నారు. లబ్ధిదారులు ఒక నెల పింఛన్ తీసుకోకపోయిన మళ్లీ నెల లేదా మూడు నెలలకు ఒకేసారి పింఛన్ తీసుకునే సదుపాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించినట్లు ఆమె తెలిపారు. కర్నూలు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి బెంగుళూరు కిషోర్, అరికెర సర్పంచ్ నాగరాజు, సీనియర్ టీడీపీ నాయకుడు మద్దిలేటి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ వాతావరణాన్ని తలపించిన పింఛన్ల పంపిణీ

**హొళగుంద, నవంబర్30, ప్రభాతవార్త:**

హొళగుంద మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుండే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రమంతటా ఒక రోజు ముందే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన హొళగుందలోని బీసీ కాలనీ, బుడగజంగాల కాలనీ, ఈబీసీ కాలనీ, రాజానగర్, ఈరలకట్ట, నీలకంఠస్వామి తదితర కాలనీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బుడగజంగాల కాలనీలో ఎన్టీఆర్ ఆసరా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో బుడగజంగాల కాలనీ తేదేపా నాయకుడు రామాంజి, రామయ్య, గోవిందు అలాగే బీసీ కాలనీలో మల్లికార్జున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎవరు పింఛన్ రాలేదని అధైర్యపడవద్దని మూడు నెలల తరువాత అయినా పింఛన్ తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లువ వారు తెలిపారు.

## టీబీ బోర్డు వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

**– టీబీ బోర్డు కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన వర్కర్లు**
**– టీబీ బోర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేవంతరకు విధులు చేపట్టమని హెచ్చరిక**

**హొళగుంద, నవంబర్30, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలో తుంగభద్ర డ్యామ్ వర్కర్లు గత కొని ్న నెలల నుండి లస్కర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు సమయానికి జీతాలు అందక తుంగభద్ర కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలు గడిచినా సమయానికి సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని, టీఏ బిల్లులు ఇవ్వడంలేదని ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడేలేరని అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ అందించడంలేదని వారు వాపోయారు. ఈ సమస్యలను బోర్డు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామని తెలిపారు. ఉద్యోగుల యూనియన్ సెక్రటరీ గోపాలకృష్ణ, అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేంతవరకు ఎవరు కూడా విధులకు హాజరుకారని కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు గ్రహించి తమకు సమయానికి జీతాలు ,టీఏ, పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేనియెడల మరింత ఉధృతంగా ధర్నా చేపడతామని ఉద్యోగులు హెచ్చరించారు.

## ఎంఈఓ విమల వసుంధరదేవి సేవలు మరువలేనివి...

**– ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి : డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగం**
**– పదవీ విరమణ పొందిన ఎంఈఓకు ఘన సన్మానం**

**గడివేముల, నవంబర్30, ప్రభాతవార్త;** గడివేముల మండల విద్యాశాఖ అధికారిని విమల వసుంధరదేవి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విమల వసుంధరదేవి 42 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో మొట్టమొదటిగా నంద్యాల జిల్లా పులిమద్ది గ్రామంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు చేపట్టారన్నారు. తర్వాత గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేశారన్నారు. గడివేములలో మండల విద్యాశాఖ అధికారిణిగా పదోన్నతి పొందారన్నారు. 42 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో ఉపాధ్యాయుల మన్ననలను పొందారని గుర్తు చేశారు. మండలంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎంఈఓ విమల వసుంధరదేవి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది చివరి అంకం అని చెప్పారు. విద్యార్థులకు విద్య నేర్పేది ఉపాధ్యాయ వృత్తి అని చెప్పారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, 1978 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆమెకు పుష్పగుచ్చాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టరీ ఇమ్మానియేల్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిజాలు రాసే విలేకరి పై కేసులు పెట్టడం తగదు

**– మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది**

**ఆలూరు రూరల్, నవంబర్30, ప్రభాతవార్త:** నిజాలు రాసే జర్నలిస్ట్‌ల పై అధికార పార్టీ నాయకులు తప్పుడు కేసులు పెట్టి పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం సరికాదని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది అన్నారు. శనివారం ఎంపిపి రంగమ్మ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదోనిలో ఎర్రమట్టి దందా పై కథనం ప్రచురించిన ఓ పత్రిక(వార్తకాదు) జర్నలిస్ట్ పై అధికార పార్టీకి చెందిన మహిళ నేత గుడిసెకృష్ణమ్మ తప్పుడు కేసు పెట్టడం ఎంతవరకు సమంజమన్నారు. ఇప్పటికైనా ఆ జర్నలిస్ట్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయం పై టీడీపీ అధిష్ఠానం ఆమె పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకులు జెట్టప్పగారి వీరేష్,, భరత్, పరమేష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఖలీల్ బాషా కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



**బనగానపల్లెరూరల్, నవంబర్30, ప్రభాతవార్త:** బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మిక భీమా పథకం కింద బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పట్టణానికి చెందిన టైలర్ షేక్ ఖలీల్ బాషా కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ మేరకు బనగానపల్లె పట్టణానికి చెందిన షేక్ ఖలీల్ బాషాకు యాక్సిడెంట్‌లో కుడి కాలు ఫ్యాక్చర్ కావడం జరిగింది. దీంతో ఆ కుటుంబానికి వైద్య సహాయం నిమిత్తం మంత్రి ఆధ్వర్యంలోని బీజీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలిచింది. ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే తక్షణ వైద్య సహాయం కోసం రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్మిక భీమా నమోదు చేసుకున్న బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు బాసటగా నిలుస్ ్తందన్నారు. అలాగే సేవా ధృక్పథంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు కష్టాల్లో అండగా నిలవడం ఆపత్కలంలో ఆదుకుంటున్న తీరు పై బాధిత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి బీసీ జనార్ ్దన్‌రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## దళిత ఉద్యోగికి జరిగిన అవమానంపై మాజీ మంత్రి రోజాపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు



**కర్నూలు హాస్పిటల్ నవంబర్ 30, ప్రభాతవార్తః** సినీనటి, వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజాపై కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రాయలసీమ హక్కుల దండోర నాయకులు అనంతరత్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది 2023 వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి రోజా బాపట్ల జిల్లా కృష్ణలంక బీచ్ పర్యటనలో భాగంగా మనోహర్ అనే దళిత ప్రభుత్వ ఉద్యోగితో తన చెప్పులు తీసుకురావాలంటూ వందల మంది చుస్తుండగానే చెప్పడంతో మనోహర్ అనే ఉద్యోగి మంత్రి మాట వినకపోతే ఉదో ్యగం నుండి తొలగిస్తుందన్న భయంతో రోజా చెప్పులు మోసుకెళ్లాడని తెలిపారు. మనోహర్ ఆవేదనతో మాజీ మంత్రి ఎక్కడికి వెళ్లితే అక్కడికి చెప్పులు మోసుకెళ్లారని ఒక దళితులు చెప్పులు మోసుకెళ్లినందన దళిత జాతికే అవమానం జరిగిందని, దళితులను రోజా ఒక బానిసల్లా చూస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే రోజాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి, జిల్లా ఎస్పీ స్పందించి రోజాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

**గోనెగండ్ల నవంబరు 30 ప్రభాతవార్త**



ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వరకు ఉన్న మలుపులను గుర్తించి అటు దగ్గరగా ఉన్న ముళ్ల పొదలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు గోనెగండ్ల సీఐ గంగాధర్,ఆదోని మోటర్ వెయికిల్ ఇన్స్‌ఫెక్టర్ శిరీష దీప్తి,కోడుమూరు ఆర్అండ్ బి డీఈ రవిచంద్ర అన్నారు.శనివారం గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాల దగ్గర ఉన్న మలుపులను వారు గుర్తించారు.ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు,కోడుమూరు, పత్తికొండ హైవే రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర ప్రదేశాలను మలుపులను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయనున్నామన్నారు. మలుపుల దగ్గర మలుపులు,ముళ్ల పొదలు రోడ్డుకు అడ్డంగా ఉన్న చోట అతివేగంగా వెళ్ల కూడదని వారు తెలిపారు.ఈ విషయం ను గుర్తించి వాహనాలకు నడపాలని వారు కోరారు.

## బస్సుటైరుకింద పడి మెకానిక్ మృతి

**కోవెలకుంట్ల, నవంబరు 30,ప్రభాతవార్త :** కోవెలకుంట అ అర్టిసి బస్టాండులో శనివారము ఉదయము ప్రవేటు బస్సుకింద పడి అదే బస్సు మెకానిక్ సంపంగి వెంటకట రమణరావు(గణపతి)(48) మృతి చెందాడు.అనునిత్యము అ బస్సు కోవెలకుంట్ల నుండి నంద్యాలకు వెళ్లి వస్తుంది. దానిని ప్రతి రోజు తెల్లవారుజామున 4గంటలకే మెకానిక్ గణపతి శుబ్రరము చేసి పెట్టిన వెంటనే డ్రైవరు బండిని తీసుకుని పాయంట్లులో పెడతారు. అందులో బాగంగా శనివారము తెల్లవారుజామున బండిని తుడువుమని డ్రైవరు చెప్పగా మృతుడు గణపతి బండి కిందికు దూరాడు. అయితే సమయంలో కావడముతో డ్రైవరు కింద ఉన్న మెకానిక్‌ను చూడకుండా బస్సు ను నడిపాడు.దీనితముకానిక్ గణపతి బస్సు టయరుచకింద పడి తలపగిలి మృతి చెందాడు.విషయం తెలిపిన వెంటనుఏ యస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుఏ చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మా గ్రామ సమస్యలు మాజీ సిఎంకు తెలిపాం

**– యూత్ ప్రెసిడెంట్ మసాల శ్రీనివాసులు**




**మద్దికెర,నవంబరు 30,ప్రభాతవార్త :** మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన వైసిపి యూత్ ప్రెసిడెంట్ మసాల శ్రీనివాసులు గ్రామంలోని సమస్యలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాడేపల్లి జగనన్న నివాసంలో జగన్‌కు సమస్యలను వివరించారు. అలాగే ఎన్నోరోజుల కల నెరవేర్చిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతూ ఉండేవని,రాష్ట్రానికి సంక్షేమ పథకాలు పరిచయం చేసిన పితామహుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగన్ సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరు సంతోషించేవారని మీరు ఓడిన ప్రజల మనసును గెలిచారని తెలిపారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను జగన్నకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు తుమ్మిటి రామకృష్ణ,బండారి అరవింద్,కుప్పగంటి అశోక్,బండారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు నూతన కమిటి కార్యవర్గం ఎన్నిక

**: ఆత్మకూరు మండల అధ్యక్షులుగా ప్రదీప్‌కుమార్**



**ఆత్మకూరు,నవంబర్30,ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే విదంగా పిఆర్‌టియు ఆత్మకూరు మండల నూతన కార్యవర్గ కమిటి ఎన్నికను పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యాక్షులు సయ్యద్ ఇబ్రహీం ఎన్నికల పరిశీలకుడిగా పి.నూర్ మహ్మద్ వ్యవహరించి నూతన కార్యవర్గం ప్రకటించారు. పిఆర్‌టియు జిల్లా వర్కింగ్ అధ్యక్షులు చాంద్‌బాష పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. శనివారం ఈ ఎన్నికల్లో ఆత్మకూరు మండల పిఆర్‌టియు అధ్యక్షులుగా సి.ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.హనుమంతు, అసోసి యేషన్ అధ్యక్షులుగా మన్సుర్‌హుసేన్, ఉపాధ్యాక్షుడు కే.రమణయ్య, మహిళ ఉపాధ్యాక్షురాలు ఎన్. శోభా, కార్యదర్శిలుగా సయ్యద్, రియాజుర్ రహిమాన్, ఆర్.మల్లీశ్వరి, మహిళ కార్యదర్శిగా పి.సురేఖ ను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా కార్య వర్గం కౌనిలర్‌లు పి.నూర్‌మహ్మద్, కే.హుసేన్‌సాహెబ్, ఎం.చంద్రశేఖర్, ఎస్.ఖాజామొద్దిన్, కే.రాజేశ్వం రెడ్డి లను ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే 30శాతం ఐఆర్ ప్రకటించి ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డిఏలు చెల్లించే విదంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని నూతన కమిటి కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. నూతన కార్యవర్గ కమిటి సభ్యులు ఆత్మకూరు మండలంలో ఎంపిక కావడంపై ఉదో ్యగులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పెన్షన్ల పంపిణిలో తెలుగు తమ్ములు

**: వాలంటరీ వ్యవస్థ లేకపోయిన ముందురోజే పెన్షన్‌ల పంపిణి**

**ఆత్మకూరు,నవంబర్30,ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో వాలంటరీలు ఉంటేనే పెన్షన్లు పంపిణి సాధ్యమ వుతుందని చెప్పిన మాటలు అన్ని శూన్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్.నబి తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార ్యక్రమంలో తెలుగు తమ్ములు, సచివాలయ ఉద్యోగులు ముమ్మరంగా వృద్దులకు, వికలాంగులకు, వితంతులకు పెన్షన్ల పంపిణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు నబి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాలలో పెన్షన్ల పంపిణి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదు నెలలో సంక్షేమం, అభివృద్ధి, చేస్తూ వెళ్తున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నేరవేర్చేందుకు వృద్దులకు రూ.4 వేలు, వికాలంగులకు రూ.6వేలు, మానశిక రోగులకు రూ.10వేలు పంపిణి చేసిన చరిత్ర టిడిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాజకీయ స్వార్దాల కోసం ఉదో ్యగులను, వాలంటీరుల పేరుతో ప్రజాధనంను కొట్లాది రూపాయాలు దుర్వినియోగం చేసిన చరిత్ర వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని విమర్శించారు. నేడు రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ పంపిణి భరోసా అందరికి అండగా నిలచిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరేశ్వరం గ్రామ టిడిపి నాయకులు దగ్గుపాటి శ్రీనివాసులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్థలం ఉండి సొంతిల్లు లేనివారు పిఎంఏవై కింద కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి..!

**– తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్,జ్యోతి**

**ఆలూరు,నవంబరు 30,ప్రభాతవార్త**



స్థలం ఉండి సొంతిల్లు లేనివారు పిఎంఏవై(అర్బన్)-2.0 కింద కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్,జ్యోతిలు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ సొంతిల్లు లేనివారికి పిఎంఏవై(అర్బన్)2.0 కింద కొత్తగా గృహాల మంజూరుకు గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు మన కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. స్థలాలు ఉన్న వారికి పిఎంఏవై(అర్బన్) కింద రూ.1.50లక్షలు,రాష్ట్రం రూ.1లక్ష మొత్తం రూ.2.50లక్షలు ప్రభుత్వం లబ్దిదారులకు చెల్లించనుందన్నారు. పిఎంఏవై గ్రామీణ కింద గ్రామాలకు ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని,అర్హులు దరఖాస్తు ఫారంతో పాటు భార్య,భర్త ఇద్దరి ఆధార్ కార్డు,రేషన్ కార్డులతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాలకు త్వరగా,పట్టణాలకు వచ్చే ఏడాది ఆమోదించబడునని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లతో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్దే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు భువనగాయత్రీ మాత ఆలయంలో హోమం పూజలు

**వెల్దుర్తి,నవంబర్30,ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని కర్నూలురోడ్‌లో జాతీయరహదారి ప్రక్కన వెలసిన శ్రీ భువనగాయత్రీ మాత ఆలయంలో డిసెంబర్1, అమావాస్య సందర్భంగా ఉచిత సామూహిక గాయత్రీ హోమం చేస్ ్తున్నట్లు పీఠాధిపతులు బాలక్రిష్ణ ఆచారి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ హోమం అనంతరం అమ్మవారికి సప్త హారతులు,ప్రసాద వితరణ ఉంటుందన్నారు.ఈ పుణ్యకార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

## బడుగు,బలహీన వర్గాలకు బాసటగా.. తెదేపా పార్టీ సభ్యత్వం..!

**– తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్,జ్యోతి దంపతులు**

**ఆలూరు,నవంబరు 30,ప్రభాతవార్త :** బడుగు,బలహీన వర్గాలకు బాసటగా..తెదేపా పార్టీ సభ్యత్వం..నిలుస్తుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్,రాష్ట్ర తెలుగు మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతిలు అన్నారు. శనివారం పట్టణంలోని వారి నివాసంలో ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండలానికి చెందిన తెదేపా మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య,సీనియర్ నాయకులు తోక వెంకటేష్,తెదేపాయువ నాయకులు ఖాదర్ భాషాలు వైకుంఠం దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి వారి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వైకుంఠం దంపతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్,బిజెపి నాయకురాలు పురందేశ్వరి నేతృత్వంలో ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ఏదైనా ప్రమాదం జరిగితే తెదేపా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. తెదేపా సభ్యత్వం బడుగు,బలహీన వర్గాల వారికి బాసటగా నిలుస్తుందని,ప్రజల సంక్షేమం,జీవిత భద్రతలకు సభ్యత్వం అత్యవసరమని,సభ్యత్వం యొక్క ఉపయోగం,విలువలను క్షుణ్ణంగా వివరించి వాడవాడల భాధ్యతాయుతంగా సభ్యత్వ నమోదు నిర్వహించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హొళగుంద నాయకులు రారావి అభిషేక్,రొట్టె మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

**ఆదోని అర్బన్,నవంబరు 30,ప్రభాతవార్త**

పట్టణంలో బ్రాహ్మణవీధిలోని కోర్టుగుడిలో శ్రీ మణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో గురుస్వామి బిచ్చల మోహన్‌స్వామి అయ్యప్పకు ప్రత్యేక అలంకరణ చేశారు. శనివారం ఉదయం అయ్యప్పకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టి అయ్యప్పస్వామికి మహామంగళారతి ఇచ్చారు. సాయంత్రం పడిపూజ,భజన కార్యక్రమాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ పూజల్లో గురుస్వాములు శివస్వామి,కృష్ణస్వామి,శ్రీనివాసులు స్వామి,జయరాం స్వామి,రామచంద్ర స్వామి,మంజునాథ్ స్వామి, ఈశ్వర్‌రెడ్డి,చంద్రమోహన్ స్వామి,తబల మోహన్‌స్వామి,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కప్పట్రాళ్ల,కరివేములలో ఉచిత ఎక్స్‌రే పరీక్షలు

**దేవనకొండ,నవంబరు 30,ప్రభాతవార్త**

మండల పరిధిలోని కప్పట్రాళ్ల,కరివేముల గ్రామాల్లో శనివారం టిబి వ్యాధి నివారణలో భాగంగా నిర్వహించిన మొబైల్ ఎక్స్‌రే క్యాంప్ నందు 102మందికి ఉచిత ఎక్స్‌రే పరీక్షలు చేయడం జరిగిందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్షయవ్యాధి ఒక అంటువ్యాధి అని ఒకరి నుంచి ఒకరికి దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు నీటి తుంపరుల ద్వారా వస్తుందన్నారు. అలాగే ఈ వ్యాధి లక్షణాలు రెండు వారాలకు మించి దగ్గు,సాయంత్రం పూట జ్వరం వస్తూ ఉండటం,దగ్గుతో పాటు గళ్ల పసుపురంగులో ఉండటం,గళ్లలో రక్తం పడటం,ఆయాసం,ఆకలి లేకపోవడం,చెమటలు పట్టడం,బరువు తగ్గటం లాంటి లక్షణాలున్న వారంత తప్పక పరీక్షలు చేయించుకోవాలని ఈ అవకాశాన్ని మండల ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి వచ్చిన మొబైల్ వాహనం రేడియో గ్రాఫర్స్ శ్రీనివాసులు,ఎల్లయ్య,జిల్లా టిబి ప్రోగ్రాం మేనేజర్ ఉమాపతి,తెర్నేకల్ పిహెచ్‌సి హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రంగస్వామి,టిబి సూపర్‌వైజర్ వీరన్న,జీవిత,మమత,ఎంఎల్‌హెచ్‌పి వినీత,ఆరోగ్య కార్యకర్త హేమలత,ఆశాలు పాల్గొన్నారు.

## చట్టాలుపై ప్రజలు అవగాహన కలిగిఉండాలి

**దేవనకొండ,నవంబరు 30,ప్రభాతవార్త**

చట్టాలు,పౌరహక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సిఐ వంశీనాథ్,తశీల్దార్ లోకేశ్వరరావులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక మాలవీధిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు గొడవలు,ఘర్షణలకు దూరంగా ఉండాలని,అందరు కలిసిమెలిసి జీవించాలన్నారు. దళిత వాడల్లో ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ ఆనందకుమార్,మాల మహానాడు నాయకుడు అంజి,ఎఫ్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘునాథ్,మాజీ ఎంపిటిసి సభ్యులు నరసరావు,రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉచ్చీరప్పలు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..!

**పెద్దకడుబూరు,నవంబరు 30,ప్రభాతవార్త**



రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకులు బొగ్గుల ఏసేపు,విజయ్‌కుమార్,కంపాడు మునెప్ప, మల్దకల్, మురళీనాయుడులు అన్నారు. శనివారం పెద్దకడుబూరు, కంబదహాల్ గ్రామాల్లో వికలాంగులు,వృద్దులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వైసిపి హయాంలో వికలాంగులను పట్టించుకోలేదని చంద్రబాబు సిఎం అయిన తర్వాత వారి పింఛన్లు రెండింతలు పెంచి రూ.6వేలు పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే నడవలేనివారికి బ్యాటరీ సైకిళ్లు కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఒకే నెలలో వికలాంగులు,వృద్దులకు రెండుసార్లు పింఛన్ ఇచ్చిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. త్వరలోనే అర్హులైన వారందరికి కొత్త పింఛన్లు కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో మూడు శస్త్రచికిత్సలు

**– సంక్లిష్టస్థితిలో ఉన్న రోగికి ప్రాణదానం –హైదరాబాద్ పెద్దాసుపత్రిల్లో నయం కాని సమస ్య**
**– కర్నూలు కిమ్స్ వైద్యుడు డాక్టర్ జానకిరామ్ ఘనత**

**కర్నూలు హాస్పిటల్, నవంబర్ 30, ప్రభాతవార్తః**




అత్యంత సంక్లిష్ట పరిస్థితిలో ఉన్న రోగికి ఏకకాలంలో మూడు శస్త్రచికిత్స లు చేసి అతడి ప్రాణాలను కర్నూలు కిమ్స్ వైద్యులు కాపాడారు. హైదరాబాద్‌లోని పెద్దాసుపత్రులకు వెళ్లినా నయం కానీ అతడి సమస్య కర్నూలు లాంటి చిన్న కేంద్రంలో ఒక ఆసుపత్రిలో నయం అయిందని కుటుంబ సభ్యులు ఆనందం వ ్యక్తం చేశారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను కిమ్స్ ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, జిఐ అంకాలజిస్టు డాక్టర్ ఎస్‌జె జానకిరామ్ తెలుపుతూ తాడిపత్రి ప్రాంతానికి చెందిన రైతు 50 ఏళ్ళ చంద్రమోహన్ గతంలో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వేర్వేరు ఆస్పత్రులలో చూపించుకున్నారు. ఆయన చిన్నపేగులకు రక్తం సరఫరా అయ్యే ప్రధాన రక్తనాళంలో అడ్డంకి(క్లాట్) ఏర్పడడం, దాంతో పాటు పెద్ద పేగు, చిన్నపేగు కలిసే చోట కొంత పాడైపోవడం, ఇతర సమస్యలు ఉన్నాయి. మళ్లీ ఇబ్బంది ఎక్కువ కావడం కడుపునొప్పి రావడంతో ఏమి తినలేకపోవడం లాంటి సమస ్యలతో కర్నూలు కిమ్స్ అసుపత్రికి వచ్చారు. అతడికి సిటిస్కాన్, కొలనోస్కోపి లాంటి పరీక్షలు చేసి అసలు సమస్య గుర్తించాం. గాల్‌బ్లాడర్ లో రాయి ఇబ్బంది పెడుతుండడం దాంతో పాటు పేగు ఒకచోట బాగ పాడైపోయి సన ్నబడడం అప్పటికే ఒకచోట బయటపెట్టి ఉంచడం లాంటి సమస్యలు ఉన్నాయి. అయితే శస్త్రచికిత్స చాల సంక్లిష్ట మని రోగి ప్రాణాలకు కూడ గ్యారెంటి ఇవ్వలేమని చెప్పి కుటుంబ సభ్యులు అంగీకరించిన తరువాత శస్త్రచికిత్స లు చేశాం.గాల్ బ్లాడర్ తొలగింపు బయటపెట్టిన భాగాన్ని మళ్లీ లోపల పెట్టి అతికించడంతో ఆటు పాడైన కొంత భాగం పేగును పూర్తిగా తొలగించి పైన కింద ఉన్న రెండు భాగాలను కలిపి కుట్టాం. దాని వల్ల అతడి సమస్యలన్ని పూర్తిగా నయమయ్యాయి. చంద్రమోహన్ ఇప్పుడు ఆరోగ్యంగా ఉండి ఆహారం కూడ సాధారణంగా తీసుకోవడం జరుగుతుందని డా.జానకీరామ్ వివరించారు.

# బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో గోశాలకు పశుగ్రాసం అందజేసిన కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి

**- పశుగ్రాసం అందజేయడంతో తులసిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బీసీ ఇందిరారెడ్డి**



**బనగానపల్లెరూరల్, నవంబర్30, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి ఎంతగానో పాటుపడుతూ నా బనగానపల్లె నా ఆరోగ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికి విదితమే. ఇందులో భాగంగానే గోవుల వలన పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలాగే గోవులను సంరక్షించేందుకు గోవులన్నింటిని గోశాలకు తరలించడం జరిగింది. అదే విధంగా గోశాలలోని గోవులకు వాటి సంరక్షణార్థం పశుగ్రాసాన్ని అందజేస్తామని బీసీ ఇందిరారెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు బీసీ ఇందిరారెడ్డి చేస్తున్న మంచి కార్యక్రమానికి ఆకర్షితులై కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి 8 ఎకరాల్లోని వరిగడ్డిని బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో గోశాలకు శనివారం తరలించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరారెడ్డి మాట్లాడుతూ గోవుల సంరక్షణకు కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి 8ఎకరాల పొలంలోని వరిగడ్డిని గోశాలకు తరలించడం ఆనందించదగ్గ విషయమని ఇందుకు వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే గోవులకు పశుగ్రాసం అందజేయడం జన్మజన్మల పుణ్యమన్నారు. గోవులకు పశుగ్రాసం ఇచ్చిన దాత తులసిరెడ్డి, ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, నంద్యాల పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్యలు మాట్లాడుతూ నా బనగానపల్లె నా ఆరోగ్యం కార్యక్రమం బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం బీసీ ఇందిరారెడ్డి ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. అదే విధంగా పట్టణంలోని గోవులను ఎంతో శ్రద్ధతో గోశాలకు తరలించడం జరిగిందన్నారు. అలాగే బీసీ ఇందిరారెడ్డి వాటి సంరక్షణ కూడా ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. బీసీ ఇందిరారెడ్డి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడంతో ఆకర్షితులై పట్టణానికి చెందిన ఆయిల్ రమణ పశు గ్రాసం కొరకు రూ.25వేలు నగదును బీసీ ఇందిరారెడ్డికి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మదనభూపాల్‌రెడ్డి, టీచర్ నాగరాజు, ఎర్రబోలు పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీశైల నియోజకవర్గ ఎస్ డి పి ఐ పార్టీ నూతన కమిటీ

**వెలుగోడు, నవంబర్ 30, ప్రభాతవార్త:** శ్రీశైల నియోజకవర్గ ఎస్ డి పి ఐ పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎస్‌డిపిఐ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో ఎస్‌డిపిఐ పార్టీ శ్రీశైల నియోజకవర్గ అసెంబ్లీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పార్టీ నూతన ప్రసిడెంట్‌గా ఆరిఫ్ హుస్సేన్‌ను, జనరల్ సెక్రెటరీగా గౌస్, వైస్ ప్రసిడెంట్‌గా ఖాజా వుశేన్, సెక్రెటరీగా తౌసిఫ్, ట్రెజరర్‌గా మొయిన్‌ని కమిటీ సభ్యులుగా అబ్దుల్లా మునీర్, హుస్సేన్ మాసూమ్, హాఫిజ్, షఫీ, సద్దాంలను ఎన్నుకోవడం జరిగిందని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌డిపిఐ రాష్ట్ర అధ్యక్షులు హాఫీజ్ అత్తావుల్లా ఖాన్ తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగోడు ఎస్‌డిపిఐ పార్టీ బ్రాంచ్ నాయకులు, ఆత్మకూరు ఎస్‌డిపిఐ పార్టీ బ్రాంచ్ నాయకులు, గాజులపల్లి ఎస్‌డిపిఐ పార్టీ బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల జీవితాల్లో పదవీ విరమణ ఓభాగం

**మాధవరం(మంత్రాలయం), నవంబర్ 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగుల జీవితాల్లో పదవీ విరమణ ఓభాగమని టిడిపి యువనాయకులు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవర ం గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన శ్రీమతి గుండ్రేవుల నిరుపమ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అథితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలి విధి నిర్వహణలో అనేకమంది విద్యార్థులను తనపాఠాలతో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాలకు, విద్యార్థులకు ఆమెచేసిన సేవలను కొనియాడారు. అనంతరం దుశ్శాలువా, ప్రత్యేక మొమెంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఉపాధ్యాయు రాలికి భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భోజరాజు టిడిపి నాయకులు ఉసేన్‌ఆలం తదితరులు పాల్గొన్నారు.

## తెల్లవారుజామున 5గంటలకే సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ

**కొలిమిగుండ్ల, నవంబర్30, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున 5గంటలకే పింఛన్ లబ్ధిదారుల తలుపులు తట్టి అవ్వతాతలకు సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 7016మంది లబ్ధిదారులకుగాను సాయంత్రానికి 6650 మందికి 94.85శాతం లబ్ధిదారులకు పింఛన్ అందజేసినట్లు ఎంపిడివో శివప్రసాద్ తెలిపారు. 1వ తేది ఆదివారం కావడంతో ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం పై హర్షం వ్యక్తం చేశారు.

## కల్వటాల గ్రామ పంచాయతీకి ఫర్నీచర్ అందజేసిన రామ్‌కో యాజమాన్యం

**కొలిమిగుండ్ల, నవంబర్30, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కల్వటాల గ్రామ పంచాయతీకి శనివారం రూ.1.5లక్షల సీఎస్ఆర్ నిధులతో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు కల్వటాల గ్రామ సర్పంచ్ సుమలతకు అందజేశారు. కంప్యూటర్ వాటర్ ఫిల్టర్, 50 కుర్చీలు, రెండు టేబుళ్లను గ్రామ పంచాయతీ వినియోగించడానికి అందజేసినట్లు రామ్‌కో ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్‌కో అడ్మిన్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్, ఎంపిడివో శివప్రసాదరెడ్డి, ఈవోఆర్డీ శివ, కల్వటాల టీడీపీ నాయకులు కృష్ణరంగారెడ్డి, కామిని భాస్కర్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సు-బైక్ ఢీ

**తుగ్గలి, నవంబరు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాతన గ్రామంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపాన శనివారం ఉదయం ఆర్టీసి బస్సు-బైకు ఢీకొన్నాయి. తుగ్గలి నుండి పత్తికొండ వైపునకు వెళ్తున్న ఆర్టీసి బస్సు పత్తికొండ వైపు నుండి తుగ్గలికి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈప్రమాదంలో పగిడిరాయి కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు వంశీ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన యువకుడిని మెరుగైన చికిత్స కొరకు అంబులెన్స్‌లో పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## ఫోక్సోచట్టంపై అవగాహన

**ఆదోని, నవంబరు 30, ప్రభాతవార్త :** పట్టణంలోని ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్ మరియు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం ప్రిన్సిపల్ మురళీమోహన్ అధ్యక్షతన ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వెంకట రమణయ్య, వెల్దుర్తి ఎన్‌జీఓ శ్రీనివాసులు హాజరై విద్యార్థులనుద్దేశించి లైంగిక నేరాల, బాలబాలికల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాలు(డ్రగ్స్)పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జొనాథన్, వెంకట్రామిరెడ్డి, రాజు, మెగనాత్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక దీపోత్సవం

**హోళగుంద, నవంబర్30, ప్రభాతవార్త:** బాలాంజనేయస్వామి దేవాలయం నందు కార్తీకమాసం సందర్భంగా 5వ శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. వివిధ రకాల ఆకృతులతో దీపాలను ఏర్పాటుచేసి వెలిగించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

## ఉత్తమ సేవలు అందించిన డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అఫీసర్‌కు ఘన సన్మానం

**కర్నూలు హాస్పిటల్, నవంబర్ 30, ప్రభాతవార్త:** ఉత్తమ సేవలు అందించిన డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అఫీసర్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.ఎల్ భాస్కర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అఫీసర్‌ను ఘనంగా సన్మాంచారు. ఈసందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డా.ఎల్ భాస్కర్ మాట్లాడుతూ 1985లో వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరి ఈరోజు వివిధ క్యాడర్‌లలో ఉత్తమ సేవలు అందించి పదవీవిరమణ పొందుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఆమె శేషజీవిత ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పరిపాలనాధికారి ఆరుణ, పిఓఆర్‌బి ఎస్కే హేమలత, డిపిఎంఓ డా.ఉమా, డిఐఓ డా.నాగప్రసాద్, ఎస్ఓ హేమసుందరం, డిఈఎంఓ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ**

**ఆదోని, నవంబరు 30, ప్రభాతవార్త**



క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని టిడిపి మాజీ ఇంచార్జ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని కుప్పగల్ గ్రామంలో గుడిసె ఆది కృష్ణమ్మ ఆదేశానుసారం రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీలో గెలుపొందిన వారికి గుడిసె ఆది కృష్ణమ్మ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. మేకడోన హనుమంతు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. గోనెగండ్ల మొదటి బహుమతి రూ.12వేలు, కుప్పగల్ జైశ్రీరామ్ రెండో బహుమతి రూ.10వేలు, పాలకుర్తి మూడవ బహుమతి రూ.6వేలు, కుప్పగల్ సీనియర్ టీమ్ నాల్గవ బహుమతి రూ.4వేలు, బల్లేకల్ ఐదవ బహుమతి రూ.2వేలు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో యం ఆంజనేయులు, కుప్పగల్ సర్పంచ్ సాంబయ్య గారి నాగిరెడ్డి, ఉప సర్పంచ్ తాయప్ప, తిమ్మప్ప, నరసయ్య, మేకడోన ఆంజనేయులు, మేకడోన లక్ష్మణ్, మేకడోన వెంకటేష్, మేకడోన శ్రీనివాసులు, కనిగేని ఎర్రిస్వామి, సిబి గోవర్ధన్, కె లక్ష్మణ్, కనిగేని బసవరాజు, కనిగేని ఈరన్న, మేకడోన కుమార్, మేకడోన తిక్కస్వామి, ఇంగలపాటి రవి, కపటి తిరుమల, మేకడోన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానతోటల సాగులతో రైతుల అభివృద్ధి

**కొత్తపల్లి, నవంబర్ 30, ప్రభాతవార్త:** ఉద్యాన తోటల సాగుతో రైతులు అధికంగా అభివృద్ధి చెందుతారని ఏపీడి దాసు అన్నారు. ఆయన శనివారం ముసలిమడుగు గ్రామంలో ఉపాధి హామి కింద సాగవుతున్న మునగ తోటలను పరిశీలించారు. గ్రామంలో అత్యధికంగా మునగ తోటలు సాగుచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామి పథకం కింద ఉద్యానతోటల సాగుకు అందించే ఆర్థికసాయం సద్వినియోగం చేసుకొని మునగ తోటలతో ఇతర తోటలను కూడ సాగుచేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఉపాధి పథకం కింద సాగుచేసిన మునగ తోటలకు పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఉపాధి హామి క్షేత్ర సహాయకుడు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

**ఆదోని, నవంబరు 30, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజాపోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణలు పిలుపునిచ్చారు. సిపిఎం ఎనిమిదో పట్టణ మహాసభలు కామ్రేడ్ బుద్దదేవ్ భట్టాచార్య ప్రాంగణం నందు సిపిఎం నాయకులు తిప్పన్న, మక్బుల్ భాను, కృష్ణమూర్తిల అధ్యక్షతన జరిగాయి. మహాసభనుద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తూనే పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మెడికల్ కాలేజ్ పనులు ప్రారంభించాలన్నారు. బైపాస్ రోడ్డు పనులు తదితర పనులు వెంటనే పూర్తి చేయాలని మహాసభలో తీర్మాణించినట్లు తెలిపారు. అనంతరం సిపిఎం జెండాను సిపిఎం సీనియర్ నాయకులు మహానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మన్న, గోపాల్, వెంకటేశులు, వీరేష్, శ్రీనివాసులు, అజమ్‌ఖాన్, మునెప్ప, నాగేంద్ర, నాగరాజు, ముక్కన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కులపై అవగాహన

**పెద్దకడుబూరు, నవంబరు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరులో కోసిగి సిఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామప్రజలకు పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలు, హక్కులు, అధికారాలపై ప్రజలకు వివరించారు. భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను కాపాడుకోవాలని అలాగే ఆ హక్కులను దుర్వినియోగం చేయకూడదన్నారు. ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించండి

**నంద్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త ప్రతినిధి:**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2024లో భాగంగా ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా పారదర్శకంగా రూపొందించాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి కె కన్నబాబు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2025లో భాగంగా జిల్లా కలెక్టరు జి రాజకుమారి, జేసి విష్ణుచరణ్‌లతో కలిసి ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కె కన్నబాబు గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈఆర్వోలతో, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. టిడిపి తరుపున ప్రసాద్‌రెడ్డి, సిపిఎం ప్రతినిధి లక్ష్మన్, వైసీపీ తరుపున సాయిరాం రెడ్డి, సమాజ్‌వాది పార్టీ తరుపున శ్రీనివాసులు, కాంగ్రెస్ నుండి రియాజ్ బాషా, బిజెపి తరుపున కశెట్టి చంద్రశేఖర్, బిఎస్పీ ప్రతినిధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో స్వీకరించిన క్లెయిమ్‌లు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు దేశవ్యాప్తంగాపెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్నతప్పులు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తే తప్పు జరిగేందుకు ఉండదన్నారు. బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో వందశాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాను పరిశీలన చేయాలని బిఎల్ఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల ఫిర్యాదులను ముందుగానే అందించాలని క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరు సహకరించేలా చూడాలన్నారు. 2025 జనవరి 1 నాటికి స్వీకరించిన క్లెయిమ్స్ డిస్పోజల్స్ పూర్తిచేయాలన్నారు. ఫాం-7 ధరఖాస్తులను కమిషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. పూర్తిగా 100 శాతం ప్రతిఒక్క క్లెయిమ్ అభ్యంతరాలు కచ్చితంగా పరిశీలన జరగాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులపై కూడ పరిశీలన తప్పనిసరిగాచేయడం జరుగుతుందని బిఎల్ఓలు మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేస్తారన్నారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితాల సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు ప్రజా ప్రతినిధుల నుండి అందించిన ఫిర్యాదుల విచారణను పారదర్శకంగా నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 13,90,225 మంది ఓటర్లు ఉన్నారని ఫాం-6, 7, 8 సంబంధించిన 5,326 క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టరు వివరించారు. వచ్చిన క్లెయిమ్స్ అభ్యంతరాల ఫిర్యాదులను గ్రామ పంచాయితీ మండల నియోజకవర్గ రెవిన్యూ డివిజనల్ జిల్లాస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి 2025 జనవరి 1న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో డిఆర్వో రామునాయక్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**మాధవరం(మంత్రాలయం), నవంబర్ 30, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాచాపురం గ్రామంలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు గ్రామానికి చెందిన బి.రాఘవేంద్ర అనేవ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు రాబడిన సమాచారం మేరకు ఇతనివద్దనుండి 186 మద్యం టెట్రా పాకెట్లు పట్టుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు. వీరివెంట కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలి -ఎంపిడిఓ.

**నందికొట్కూరు, నవంబర్ 30, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలని లేని పక్షంలో చర్యలు తప్పవని మండల అభివృద్ధి అధికారి సుబ్రమణ్యం శర్మ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని ఎం.పి.పి.ఉర్దు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయం నందు ఎం.ఎస్.ఎం.ఇ. సర్వే ఎన్‌పిసిఐ, హౌస్ ఓల్డ్ సర్వే, పెన్సన్ పంపిణి కార్యక్రమాలపై ఎంపిడిఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరితగతిన అన్ని సర్వేలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు,

## విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ఆళ్లగడ్డ, నవంబర్ 30, ప్రభాతవార్త:** విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, దేవాలయాల పాలక మండలిలో విశ్వబ్రహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలని శనివారం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు ఆళ్లగడ్డ విశ్వబ్రహ్మణ సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ రామాచారి విశ్వకర్మ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రామాచారి విశ్వకరమ్మ మాట్లాడుతూ రాష్ట్ర విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని, దేవాలయాల పాలక మండలిల్లో బ్రహ్మణులకు, నాయి బ్రహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించినట్లు విశ్వబ్రహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల జనాభా వున్న విశబ్రహ్మణులు తెలుగుదేశం పార్టీ అవిరాభవం నుంచి పార్టీలో అత్యంత క్రీయాశీలక పనిచేస్తున్నారు. కానీ విశ్వబ్రహ్మణులుకు ఎటువంటి గుర్తింపు కానీ, పార్టీలో పదవులు కానీ ఇవ్వకపోవడం విశ్వబ్రహ్మణులకు తీవ్ర అనాయ్యం జరుగుతుందన్నారు. మీరు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి విశ్వబ్రహ్మణులకు పార్టీ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తప్పకుండా మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ నాయకులు, విశ్వబ్రహ్మణులు పాల్గొన్నారు.

## అపార్ గుర్తింపు కార్డు కోసం విద్యార్థుల సమస్యను పరిష్కారించండి

**నందికొట్కూరు, నవంబర్ 30, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం ప్రారంభించిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) విద్యార్థుల విద్యా డేటాను డిజిటల్ కేంద్రీకరించడానికి కీలకమైనదని అయితే ఆపార్ ఐడి కోసం దరఖాస్తు చేసే విద్యార్థులు తమ ఆధార్ కార్డులను అప్డేట్ చేయడంలో అనేక సమస్యలు ఎదుర్కోంటున్నారని వాటని వెంటనే పరిష్కారించాలని కోరుతు ఎన్.ఎస్.యు.ఐ.విద్యార్థి సంఘం తాలుకా అధ్యక్షుడు సాయికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం తహాసిల్దార్ బి.శ్రీనువాసులు కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు విద్యార్థులు ఆధార్ సెంటర్‌కు వెలితే వారు ఈ సెంటర్ ఆసెంటర్ అంటూ చెబుతున్నారని, రిజెక్ట్ అయితే అధిక అపరాద రుసుం విధించబడుతొందని అప్డేట్ చేయడానికి భయపడుతున్నారని, సచివాలయాలు లేదా పాఠశాలల వద్దఆధార్ అప్డేట్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పుల గురించి అవగాహన కల్పించాలని, అలాగే ప్రతి సచివాలయంలో ఆధార్ అప్డేట్ చేయాలన్నారు. కావున వెంటనే విద్యార్థులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కారించాలని లేని పక్షంలో ఆంధోళనలు చేపడుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ వెంకట అప్పారావు 109వ వర్ధంతి

**కర్నూలు విద్య, నవంబర్ 30, ప్రభాతవార్త:** క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో గురజాడ వెంకట అప్పారావు 109వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డా. వివి సుబ్రమణ్యకుమార్ అధ్యక్షత వహించి గురజాడ అప్పారావు సాహిత్యసేవను, సంఘసంస్కర్తగా ఆయన చేసిన కృషిని తెలియజేశారు. తెలుగుశాఖ అధ్యాపకులు డాక్టర్ మల్లయ్య గురజాడ అప్పారావు జీవిత విశేషాలను తెలుగు భాషకు ఆయన చేసిన కృషిని వివరించారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు డా.ఎం షమిదా బేగం గురజాడ అప్పారావు గేయాలను, సంఘసంస్కరణ ఉద్యమాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్**

**మాధవరం(మంత్రాలయం), నవంబర్ 30, ప్రభాతవార్త:** ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలతో సైబర్ నేరాల నియంత్రణకు చెందిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వ్యక్తిగత వివరాలు అపరిచిత వ్యక్తులకు పంచుకోరాదన్నారు. లోన్‌యాప్ స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వీడియోకాల్ స్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఆన్సర్ చేయకూడదన్నారు. మీకు తెలియని లింక్ స్‌ను వాడకూడదన్నారు. కావున సైబర్ నేరాలపట్ల పోలీసులు తెలియజేసే సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ కానిస్టేబుల్ స్ భాస్కర్, వీరేష్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న పద్ధతిలో విద్యార్థులను ప్రోత్సాహిస్తున్న ఉపాధ్యాయులు

**- విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఆరా తీయాలి**

**నందికొట్కూరు, నవంబర్ 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న పద్ధతిలో విద్యార్థులను ప్రోత్సాహిస్తూ వారు త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం 2024 సంవత్సరం పాఠశాలలో నిర్వహించిన గణితం ప్రతిభ పోటీ పరీక్షలలో అంత్యంత ప్రతిభ కనపరిచిన జస్వంత్, శ్వేత, ఫాతిమా, అనూష, అంజలి, దేవరాజ్, జయచంద్రుడు, ఆశీర్వదమ్మ, శివనందిని విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు డి.ఈశ్వరయ్య వారి ఇళ్ళ వద్దకే వెళ్ళి తల్లిదండ్రుల సమక్షంలోనే వారిని అభినంధించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని క్రమ శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నతస్థాయిలో నిలబడాలని తెలిపారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర ఎంతో అమూల్యమైనదని తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారని వారి పరిస్థితి ఎలా ఉంది అని పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. దశల వారిగా అన్ని సబ్జెక్టులలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి వారి ప్రతిభను ప్రోత్సాహిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రఫీఅహ్మద్ మాట్లాడుతు తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారిని భవిషత్తులో ఒకస్థాయిలో చూడాలన్న సంకల్పంతో వారిని క్రమశిక్షణ వైపు వెళ్ళేలా తగు చర్యలు తీసుకోవాలని అప్పుడే వారికి బంగారు భవిషత్తు ఇచ్చినవారు అవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మహామ్మద్ హుశ్శేన్, సభ్యులు స్వాములు, శివకుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా మధ్వారాధన వేడుకలు

**మంత్రాలయం, నవంబర్ 30, ప్రభాతవార్త:**

కర్ణాటకలోని నవబృందావన గడ్డలో వెలసిన శ్రీ పద్మరాభతీర్థుల మధ్యారాధన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామివారి బృందావనానికి ఉదయం నుండే ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతి, మహా పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ముందుగా పీఠాధిపతికి సోదేవాదిరాజమఠం పీఠాధిపతి శ్రీ విశ్వవల్లభ తీర్థులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చి, తప్తముద్రధారణ చేశారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

## పంట దిగుబడి ఆధారంగా పంట భీమా

**నంద్యాల టెక్కె, 30 నవంబరు, ప్రభాతవార్త:** పంట దిగుబడి ఆధారంగా పంట భీమా వర్తిస్తుందని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి వైపీ.మురళీకృష్ణ తెలిపారు. నంద్యాల మండలం ఊడుమాల్పురం గ్రామంలో వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఇ.ప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామంలో రైతులు పండించిన వరిపంట దిగుబడిని లెక్కించారు. ఈసందర్భంగా డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ వరి పంటలో కోత ప్రయోగంలో భాగంగా గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని దిగుబడి ఆధారంగా గ్రామంలో పంట భీమా వర్తింపజేస్తారని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి మనోహర్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సంధ్య పాల్గొన్నారు.

## మైపర్‌లో వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన కార్యక్రమం

**కర్నూలు విద్య, నవంబర్ 30, ప్రభాతవార్త:** నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాలలో శనివారం వరల్డ్ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్మంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్ విద్యార్థులకు ఎయిడ్స్ మహమ్మారి యొక్క లక్షణాలు ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, ప్రపంచంలో దానికి సంబంధించినటువంటి మందులు, ఈవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వకృత్వపు పోటీలు నిర్వహించి ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ఏ క్యాంపు కళాశాల నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా సమ సమాజం ఎయిడ్స్ బారీన పడకుండా వుండాలని నినదిస్తు ర్యాలీ నిర్వహించారు. ఆర్ రఘువీర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యన్నదాన ప్రసాద వితరణకు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు, నవంబర్30, ప్రభాతవార్త**



శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన వితరణ పథకంనకు శనివారంనాడు హైదరాబాద్ వాస్తవ్యులు సినినటుడు బాబు రాజేంద్రప్రసాద్ అనుదాత రూ.1,00,200/-ల విరాళమును సహాయ కార్యనిర్వహాణాదికారి జి.స్వాములుకు అందజేసారు. విరాళం అందజేసిన దాతలకు దేవస్థానం తరుపున తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

## శభాష్‌పురంలో పోలీసులు కార్డెన్ సెర్చ్

**తుగ్గలి, నవంబరు 30, ప్రభాతవార్త**

తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన శభాష్‌పురంలో కర్నూలు ఎస్పీ బిందు మాధవ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున పత్తికొండ రూరల్ సిఐ పులిశేఖర్ ఆద్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. 5మంది సిఐలు, 6మంది ఎస్ఐలు, సుమారు 40మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని గల్లి గల్లిని అనుమానితుల ప్రతి ఇంటిని తనిఖీలు చేశారు. అలాగే నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని 15బైక్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే సుమారు 250లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. పత్తికొండ రూరల్ సిఐ పులిశేఖర్ మాట్లాడుతూ ఎవరైనా గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే అటువంటి వారి సమాచారం తమకు తెలియజేయాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ టౌన్ సిఐ జయన్న, ఆస్పరి సిఐ మస్తాన్‌వలితో పాటు మరింతమంది సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో పౌరహక్కులపై అవగాహన



**వెల్దుర్తి, నవంబర్30, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణంలోని ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని పౌరహక్కులపై మండల తహాశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎస్పై అశోక్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు రాజ్యాంగంలోని చట్టాల గురించి వివరించారు. అంటరానితనం, కులవివక్షతలను ఎవరైనా ప్రోత్సహిస్తే అటువంటి వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. ప్రజలంతా కలిసిమెలిసి జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహాశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎస్పై అశోక్, ఎమ్మార్పీఎస్ నాయకులు బజారు, గిడ్డయ్య, సుధాకర్, విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణిలో ముందు

**: శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో కార్యక్రమం**

**ఆత్మకూరు, నవంబర్30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5నెలలు పూర్తి కావచ్చినప్పటికి ఎలాంటి వాలంటరీ వ్యవస్థ లేకపోయిన వృద్దులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ల పంపిణి కార్యక్రమం విజయవంతంగా ఒకరోజు ముందుగానే పంపిణి చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కిందని రాష్ట్ర తెలుగు యువత కార్యవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరి వెన్న శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 2వ వార్డులో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెన్న శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ ఆదేశాల మేరకు పట్టణంలో పెన్షన్ల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వాలంటరీలు ఉంటేనే పెన్షన్లు పంపిణి చేస్తారు అనే అపోహను ఎన్‌డిఏ ప్రభుత్వం పోగొటిందని అన్నారు. సచివాలయ ఉద్యోగులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు కలసి ఇంటింటికి తిరుగుతూ పెన్షన్ల పంపిణి ఒక్కరోజులోనే విజయవంతంగా అందించిన ఘనత ఎన్‌డిఏ ప్రభుత్వానికి దక్కిందని కోనియడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్న లోకేశ్వరరెడ్డి, బాస్కర్‌రెడ్డి, సతీష్‌బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వై నాట్ 175 అనే వారిని ప్రజలు పాతాళ గంగలో కలిపారు - మంత్రి బిసి

**: 3200కోట్లతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు**



**నంద్యాల, నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి**
రాష్ట్రంలో గతంలో అదికారములో ఉందని మన వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తు వైనాట్ 175 అనే వారిని ప్రజలు పాతాల గంగలో కలిపివేశారని ప్రజలను ఇచ్చిన దానికి ప్రతి పలంగా మనము అంతా వారి అభ్యున్నతికి పాటు పడాలని రోడ్డు భవనాలు, పెట్టుబడులు మౌళిక వసతుల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డి అన్నారు. శనివారము ఓర్వకల్లు మండలంలోని కార్తీక మాస వనబోజన మహోత్సవము కార్యక్రమంలో మంత్రులు బిసి, జనార్దనరెడ్డి, యన్‌యండి ఫరూక్, యంయల్ఎ గౌరు చరితారెడ్డి గౌరు వెంటకరెడ్డి ,మాండ్రశివానందరెడ్డి నంద్యాల జిల్లా పార్టి అద్యక్షులు మల్లెల రాజశేఖరు, ఏపి విత్తనాబివృద్ధి చైర్మన్‌దర్మవరపు సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.ముందుగా మంత్రులు కాల్వ బుగ్గరామేశ్వర దేవాలయంకు చేరుకోగనే యంయల్ గౌరు చరితారెడ్డి దంపతులు,రాజశేఖరులు స్వాగతము పలికారు అనంతరము నేతలంతా దేవాలయంలో పూజలో పాల్గొన్నారు. శివలింగమును అబిషేకము చేశారు. అనంతరముకర్నూలు నుండి వచ్చిన నృత్య కళాశాలత విద్యార్తులు చేసిన నృత్యము మంత్రాలు తిలకించారు. దీనితో మంత్రి బిసి జనార్దనరెడ్డి వారికి తన సొంత నిదులు రూ 50000ల చెక్కును అందించారు. అనంతరము నిమినేటెడ్ పదవులు వరించిన వారికి మంత్రులు సన్మానము చేశారుఅటుతర్వాత ఏర్పాటు చేసిన సమావేశములో మంత్రి బిసి మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు మరింత పేరు తీసుకురావడముతో పాటు అబివీద్దిసంక్షేమ పథకాల్లో జిల్లాకు ఎక్కువనిదులు సాదించుకునేందుకు సహచర మంత్రులు ఎమ్మెయల్ఎలు అంతా కలిసి కట్టుగా పని చేస్తున్నామనిచెప్పారు. అందులో బాగంగా నంద్యాల జిల్లాలోని ఓర్వకల్లులో రూ 3200కోట్లతో ఇండస్ట్రీల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 5ఏళ్ల పాటు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా తెలుగు దేశం పార్టి కార్యకర్తలు నాయకులు ఎన్నో కష్టాలు పడ్డారని అందుకే మనల్ని ఎంతో బాద్యతగా ప్రజలు గెలిపించారన్నారు. అలాగే వైనాట్ 175 అన్న వాళ్లను పాతాళ గంగలోకి ప్రజలే తొక్కేవారన్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు అద్వర ్యంలో రాష్ట్రంలో సంక్షేమం అబివృద్ధి పథకాలు ప్రజలందరికి సమపాళ్లలో అందుతున్నాయని త్వరలో సూపర్ సిక్స్‌హామీలను విజయవంతము అమలు చేస్తామని మంత్రి తెలిపారు. గత 5ఏళ్ల రోడ్డు భవనాల శాఖను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యము చేసిందని మన రాష్ట్రంలోరోడ్లను గతంలో టిడిపి హయాంలోఓఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు అదర్శంగా నిలిచేవని వైసిపి పాలనలోఈ 5ఏళ్ల రాష్ట్రంలోరోడ్లు మౌళిక వసతులనుపక్కన పెటట్టముతో పక్క రాష్ట్రాల వారు కూడాఅవహేళన చేసే పరిస్థితి నెలకొందన్నారున. నేడు రాష్ట్ర అర్థిక ఎన్ని కష్టాలుపడుతున్న ప్రజలకు మెరుగైన గంతలు రహిత రహదారులు అందించాలనే లక్ష్యంలో రూ.. 861 కోట్లలో రోడ్లు మరమ్మత్తుఉల చేపడుతున్నామన్నారు. అలాగే గత ప్రభుత్వంలోని పాత బకాయిలు కూడా దాదాపు రూ 1000 కోట్లు ఇవ్వడము జరిగిందన్నారు. సూపర్ సిక్సు లో బాగంగా ఇప్పటికే పింఛనులురూ 4000 పెంచాం దీపం 2 పథకాన్ని తీసుకొచ్చాం,త్వరలో ఆర్టిసి బస్సుల్లోమహిళలకు ఉచిత ప్రయాణసౌకర్యము కల్పించయనున్నట్లు చెప్పారు.

# రూ 30ని రూ 4వేలు చేసిన ఘనత మాదే - భూమా అఖిలప్రియ



**నంద్యాల, నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి**
దేశంలోఎక్కడ లేని విదముగా రూ 30ని రూ 4000వరకు పించను పెంచి అందిస్తున్న ఘనత మా ప్రభుత్వందేనని అళ్లగడ్డ యంయల్ఎ భూమాఅఖిలప్రియ అన్నారు. శనివారము యన్‌టిఅర్ భరోసా పించనులకు సర్వాయిపల్లెగ్రామంలో పంపినీ చేశారు అలాగే అక్కడే గ్రామంలో నూతనంగా నిర్మాణము చేసిన మినీ గోకులంను ప్రారంబించారు. ఈసందర్భముగా అమె మాట్లాడుతూ గతంలో రూ 30ఉన్న పించను రూ 4000వేల వరకు పెంచి అందిస్తున్న ఘనత మాదే అన్నారు.రాష్ట్ర ప్రజల అవసరాల కోసం ఒకటవ తేది కంటే ముందే 30వతేదినే పించను పంపినీ చేసిన ఘనత మాదే అన్నారు.గత ఐదు సంత్సరాలు వైసిపి ప్రభుత్వం పించను వెయ్యి రూపాయలు పెంచుతా అని చెప్పి పెంచలేని ప్రభుత్వం ఏదైనా ఉదంటే అది వైసిపి ప్రభుత్వమే చంద్రబాబునాయకడు మాట ఇచ్చిన ప్రకారము గెలిచినప్పటి నుంచే ఒకటోతేది నుండి 4000 ఇవ్వడమె జరిగింది,ప్రజలందరి తరుపున చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము ఈ రోజు చేతగాని ముఖ ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పసేరు తెచ్చుకున్నారని అరోపించారు. అలాగే చేతగాని ఎమ్మెల్యేలుగా గతంలో వైసిపి నాయకులు పసేరుతెచ్చుకున్నారని అరోపించారు. ప్రజలందరేఊ గ్రామ స్థాయిలో అబివృద్దిపథకాలు చూడబోతున్నారు.ఈ రోజు నినీ గోకులం సర్వాయిపల్లెజిల్లాలోనే మొదటి మినీ గోకులంను ప్రారంబించడమైనది.ఇదే కాదు అళ్లగడ్డ తాలూకలో అన్నిగ్రామాల్లోఅబివృద్ది బాట పడతాయని ప్రజలందరికి విన్నవించుకుంటున్నాము,అలాగే అళ్లగడ్డ రైతులు ఎవరు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని అలాగే ఉయ్యాలవాడ మండలానికిలిప్ప ఇరిగేషన కావాలని అడగడము జరిగింది. రెండు నుంచి మూడుకోట్లు అవుతుందిన మంత్రితో కలెక్టరుతో మాట్లాడి త్వరలో చేపస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఖచ్చితంగా దారి చూపిస్తామనిమొన్నటికి మొన్న అళ్లగడ్డపట్టణంలో జాబ్ మేళ ఏర్పాటు చేసి అళ్లగడ్డ తాలూక నిరుద్యోగులకు 65 జీబులు ఇప్పంచడము జరిగింది.అళ్లగడ్డ తాలూకలో నిరుద్యోగయువత ఎవరు ఉండకుండా చూసుకుంటామని చెప్పారు.

## ఇది ప్రజల సంక్షే ప్రభుత్వం



**నంద్యాల, నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి**
ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వంని రాష్ట్ర అబివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సగరవ్మఉగా నిర్వహిస్తోందని రాష్ట్ర ముస్లీం, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ అన్నారు. శనివారము 29వ వార్డులో పించనులను మంత్రి అందించారు. ఈసందర్భముగా అయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అద్కి గరములోకి రాగనే తొలి మాసం ప్రలి నెలా ఒకటవ తేదిన పించనులు పంపినీ చేస్తామనిమాట ఇచ్చాము. డిశంబరు 1వ తేది అదివారము కావడముతో ఒక రోజు ముందగనే ప్రభుత్వం నవంబరు 30వ తేదినే పించనులను అందిస్తున్నామని చెప్పారు.వీటిని ఇంచార్జి మంజులసుబ్బరాయుడుఅద్వర్యంలో షాదిక్ నగరులో నందు మంత్రి ఫరూక్అందించారు.

# రోడ్లే గ్రామాల అభివృద్దికి కీలకం..

**– ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్**
**చిప్పగిరి, నవంబరు 30,ప్రభాతవార్త**
మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయని అనడానికి రోడ్లే ప్రధాన కారణమని ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్ ్జ బి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. శనివారం చిప్పగిరి మండలంలోని కుందనగుర్తి గ్రామంలో గ్రామ సర్పంచ్ పురుషోత్తం ఉపాధి నిధులు రూ.20లక్షలతో నిర్మిస్తున్న సిసిరోడ్డు పనులను ఇంచార్జ్ వీరభద్రగౌడ్ సర్పంచ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ వీరభద్రగౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సిసిరోడ్లు, డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఏ మూలనైనా నిర్మాణాలు జరగలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని కొనియాడారు. అనంతరం గ్రామంలో డిసెంబరు నెలకు సంబంధించిన పింఛన్ ఒకరోజు ముందుగానే కూటమి ప్రభుత్వం అందజేస్తున్నట్లు వివరించారు. వృద్దులకు రూ.4వేలు,వికలాంగులకు రూ.6వేలు,దివ్యాంగులకు రూ.15వేలు అందిస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడును ప్రజలు మరిచే స్థితిలో లేరన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఒక్కరోజు ముందు పంపిణీ చేసే పింఛన్‌ను అధికారులతో కలిసి పంపిణీ చేశారు.ఎంపిడిఓ అల్లాబకాష్,టిడిపి యువ నాయకులు మేకల రవి యాదవ్,కుందనగుర్తి గ్రామ సర్పంచ్ పురుషోత్తం,దేగులపాడు సర్పంచ్



నీలకంఠ,చిప్పగిరి ఎంపిటిసి ఎల్లంకి రజిని,నంచర్ల మాజీ ఎంపిటిసి శివలింగ,బెల్దోన సర్పంచ్ కరివేముల సావిత్రి, గోవిందు, కుందనగుర్తి మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి,పోతురాజుల రాముడు,కాజీపురం ఓబయ్య, తిమ్మాపురం నాగిరెడ్డి, రామదుర్గం తిమ్మయ్య, కొండ గోవిందు, నెట్టప్ప,గ్రామప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరిగడ్డి దగ్దం..



**మిడుతూరు, నవంబర్30, ప్రభాతవార్త;**
మండలంలోని పీరుసాహెబ్‌పేట గ్రామంలో శనివారం విద్యుత్ తీగలు తాకి ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమయ్యింది. వెలుగోడు మండలం మోత్కూరు గ్రామం నుంచి వరిగడ్డి విక్రయానికి రాగా పీరుసాహెబ్‌పేటకు చెందిన రైతు కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దాదాపు చాలా సంవత్సరాల క్రితం నుంచి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండగా వాటిని ఎత్తు పెంచాలని సంబంధిత అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భాలు ఉన్నాయని రైతులు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## ఒకరోజు ముందే పించన్లు పంపిణీ చేయడం పట్ల హర్షం..!

**– ఇక నుండి 3నెలలకోసారి కూడా పింఛన్ తీసుకోవచ్చు**
**– కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట : నరవ దంపతులు**



**పెద్దకడుబూరు, నవంబరు 30,ప్రభాతవార్త**
ప్రతి నెల 1వ తేదిన పింఛన్లు ఇస్తుండగా ఈ నెల మాత్రం ఒకరోజు ముందేగానే లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయడం పట్ల టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి,మాజీ ఎంపిపి నరవ శశిరేఖలు హర ్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శనివారం ఓ ప్రకటనలో విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. గత వైసిపి పాలనలో ఒక నెల పించన్ తీసుకోకుంటే మరుసటి నెల పించన్ వచ్చేది కాదని ఏ లబ్దిదారుడు కూడా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ఏదైన కారణం చేత ఒకటి,రెండు నెలలు పించన్ తీసుకోకపోయినా మూడవ నెల పించన్ మొత్తం తీసుకునే సౌలభ్యం పించన్‌దారులకు కల్పించింద న్నారు. అలాగే మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో మండల కన్వీనర్ ఈరన్న ఆద్వర్యంలో పింఛన్లు పంపిణీచేశారు. చిన్నకడు బూరులో టిడిపి గ్రామ అధ్యక్షుడు ఎంజి నరసన్న ఆద్వర్యంలో పించన్లను పంపిణీ చేశారు. చిన్నతుంబళంలో వీరేష్‌గౌడ్, పెద్దకడుబూరులో మీసేవ అంజినేయులు,తలారి అంజి,హెచ్ మురవణిలో సత్యగౌడ్, పీకలబెట్టలో తోవి ఈరన్న,పులికనుమలో సత్యల ఆద్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమను ప్రొత్సహించేందుకు మినీ గోకులం

**– ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**





**ఆళ్లగడ్డ, నవంబర్ 30, ప్రభాతవార్తః**
పశుపోషకులకు చేయూత అందించేందుకు పాడిపరిశ్రమను ప్రొత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి ప్రొత్సహిస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. శనివారం ఉయ్యాలవాడ మండల పరిధిలోని సర్వాయి పల్లెలో మినీ గోకులంను ఆమె ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ 2018లో టిడిపి ప్రభుత్వం మినీ గోకులంలను ప్రారంభించిందని వాటిని వైసీపీ ప్రభుత్వం విస్మరించి లబ్దిదారులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాడిపరిశ్రమలపై దృష్టిపెట్టి మినీగోకుల నిరా ్మణాలను ప్రొత ్సహిసు ్తందని సర్వాయి పల్లిలో 2.30 వేలతో మినీ గోకులం ప్రారంభించడంతో ఈస్కీంకు పూర్వవైభవం వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు అనంతరం ఆమె పెన ్షన్ పంపిణి కార్య క్రమంలో పాల్గొని మాట్లాడుతూ మనదేశంలోనే కాక రూ.30ల నుంచి 4 వేల రూపాయల వరకు పెన ్షన్ పెంచి రాష్ట్రం మన టిడిపి ప్రభుత్వం పాలిస్తున్నరాష్ట్రం అన్నారు. రాష్ట్ర ప్రజల అవసరాల కోసం 1వ తేది కంటే ముందే 30వ తేదిన పెన్షన్ పంపిణి చేసి ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం అన్నారు. ఈకార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిడి రమణయ్య, ఎండి వరప్రసాద్, వెటర్నరీ డా.శ్రీలక్ష్మీ ఎంపిడిఓలు, ఎమ్మార్వోలు, ఎపిడి సాంబశివరావు, ఏపిఓ రవిప్రకాష్, రైతు అవుల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికి ఫింఛన్లను అందిస్తాం



**ప్యాపిలి నవంబరు30 ప్రభాతవార్త:**
అర్హులైన వారందరికి కోత్త ఫింఛన్లను అందిస్తామని నంద్యాల ఎమ్పీ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిలు అన్నారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ఎన్టీయార్ భరోసా ఫించన్లను పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఫింఛన్ల సోమ్ము పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. మూడు వేల రూపాయలు ఉన్న ఫించన్‌ను నాలుగువేలకు పెంచి ప్రతి నెల ఒకటవ తేదినాడే పింఛన్‌ను ప్రభుత్వం పంపిణి చేస్తున్నదని తెలిపారు. ఎన్టీయార్ భరోసా ఫించన్ పేద కుటుంబాలకు భరోసాగా నిలిచిందని స ్పష్టం చేశారు. అర్హులైన వారందరు ఫించన్ల కోసం ధరఖాస్తులు చేసుకోవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడివో శ్రీనివాసులు, సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## విద్యార్థులు స్పోర్ట్స్‌క్లబ్ ఆకాడమిని సద్వినియోగం చేసుకోండి

**: చైర్మన్ పస్పిల్ మున్నా**
**: వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, తైక్వాండో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో ఉత్సహం**
**: విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించిన స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్**



**ఆత్మకూరు,నవంబర్30,ప్రభాతవార్త:**
చదువుతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు క్రీడా రంగాలలో ముందుకు వెళ్లే విదంగా ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ ఆకాడమిని సద్వినియోగం చేసుకునే విదంగా విద్యార్థినీ, విద్యార్థులు ముందుకు రావాలని స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్‌మునా ్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్బంగా స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో విద్యార్థులకు ఉచితంగా క్రీడా శిభిరాలను ఏర్పాటు చేసి క్రీడా రంగాలో ముఖ్యమైన క్రీడలను అందించే విదంగా స్పోర్ట్స్‌క్లబ్ పనిచేస్తుందన్నారు. చదువుతో పాటు స్పోర్ట్స్ కోట క్రింద ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఆత్మకూరు స్టేడియంలో వాలీబాల్ ఖోఖో, తైక్వాంతో బల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడలో శిక్షణ అందించేందుకు వాలీబాల్ శిక్షకులు అజ్గర్, నిమ్మి క్రిష్ణయాదవ్‌లు అందుబాటులో ఉంటారని వివరించారు. ఈ అవకాశంను విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విదంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నయబ్ సయ్యద్, కోచ్ ఖాజాహుసేన్, టైగర్‌బాబు, వ్యాయమ ఉపాధ్యాయులు మహెబుబ్‌బాష, స్పోర్ట్స్‌క్లబ్ కమిటి సభ్యులు పాఠశాల ఉపాధ్యాయులు, తదతరులు పాల్గోన్నారు.

## సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి




**నందికొట్కూరు,నవంబర్ 30,ప్రభాతవార్త:**
రాష్ట్ర లీగల్ సర్వీస్ కమిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవా కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకటశేషాద్రి శనివారం నందికొట్కూరు సబ్‌జైల్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా జడ్జి జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకొనే ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయ సహాయం చేస్తామని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితి, జైలులో వారి సౌకర్యాలు, ఆహార నాణ్యత, మెను వివరాల గురించి తెలుసుకున్నారు. రికార్డులను. జైలు పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరిన్‌డెంట్ జనార్ధన్, జైల్ విజిటింగ్ లాయర్ అరుణ్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలను అరికట్టాలి

**– డిఎస్పీ మహబూబ్ బాషా**



**కర్నూలు విద్య, నవంబర్ 30, ప్రభాతవార్తః**
క్లస్టర్ యూనివర్శిటి ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం సైబర్ నేరాల మీద అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల సైకాలజి విభాగం నిర్వహించిన ఈసదస్సుకు ప్రిన్సిపాల్ వివిఎస్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆధునికంగా వచ్చిన టెక్నాలజీని సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని మన తెలియనితనం అత్యాశ సైబర్ నేరస్థుల ఎత్తుగడలు తెలియకపోవడం వల్ల మనం దారుణంగా మోసపోతున్నామన్నారు. క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండి వీటి పట్ల అవగాహన పెంచుకోవడం జాగ్రత్తగా మెలగడం అవసమన్నారు. మహిళా విద్యార్థులు తమ చుట్టు ఏమి జరుగుతుందో జాగ్రత్తగా గమనించాలని నాయకత్వ లక్షణాలతో ధైర్యంగా ఉండాలని అడ్వకేట్ హేమలత తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ మహిళలు మాన సికంగా బలవంతులు కావాలని ధైర్యంగా లక్ష్యాలను చేరుకోవాలని సైబర్ నేరాల వంటివి ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు. సైబర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పిపిటి ప్రదర్శన ద్వారా సైబర్ నేరాల నుండి ఎలా తప్పించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మీ, అధ్యాపకురాలు స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ డా.వెంకటరెడ్డి, డా.పార్వతి దేవి, మణికంఠ అధ్యాపక విద్యార్థి బృందం పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**కొలిమిగుండ్ల, నవంబర్30, ప్రభాతవార్త:**
కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఉమ్మాయిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం లో స్వామివారికి కార్తీకమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్వర్య ంలో స్వామివారికి పూజల అనంతరం ప్రసాద వితరణ గావించారు. గ్రామానికి చెందిన భజన సంఘం కళాకారులు గ్రామభజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

## వార్తకు స్పందన

**– గత మూడు రోజుల నుండి ప్రభాతవార్తలో వస్తున్న వరుస కథనాలకు డీఎల్‌పీవో వీరభద్రప్ప విచారణ**
**– నకిలీ అసిస్టెంట్ బిల్ కలెక్టర్ ఇచ్చిన రశీదుల పై బాధితులను విచారించిన డీఎల్‌పీవో**
**– నకిలీ బిల్ కలెక్టర్‌ను విచారించి ఆయన ఇచ్చిన రశీదులు ఫేక్ అని తేలడంతో ఉన్నతాధికారులకు నివేదిక**



**ఆలూరు రూరల్, నవంబర్30, ప్రభాతవార్త:**
ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పొరుగుసేవల పద్దతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు, తనకు సంబంధంలేని అసిస్టెంట్ బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుడి పై ప్రభాతవార్తలో గత మూడు రోజుల నుండి వరుస కథనాలు వస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై శనివారం డీఎల్‌పీవో వీరభద్రప్ప ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగానే పలు రికార్డులను పరిశీలించడంతోపాటు సంబంధిత సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ నుండి పాత రికార్డులను వారి వద్ద నుండి తీసుకుని పరిశీలించడం జరిగింది. అలాగే గతంలో నకిలీ ఇంటి పన్ను రశీదులు మరియు షాప్‌లకు సంబంధించిన రశీదులు ఏమైనా ఉంటే వెంటనే కార్యాలయంలో అందజేయాలని ఆ అసిస్టెంట్ బిల్ కలెక్టర్‌కు డీఎల్‌పీవో సూచించారు. అలాగే ఇక నుండి ఇంటి పన్ను, కుళాయి పన్ను బిల్లుల వసూళ్ల లాంటి విధులకు పంపించకూడదని జిల్లా ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చేంతవరకు ఆయనకు ఆఫీస్ వర్క్‌కాని, కార్యాలయానికి సంబంధించి ఏ ఇతర పనులు అప్పగించవద్దని గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్‌కు సూచించారు. ఇలాంటి తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో వీరభద్రప్ప హెచ్చరించారు.

## ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపం

**శ్రీశైలంప్రాజెక్ట్,నవంబర్30,ప్రభాతవార్త**
కార్తికమాసం సందర ్బంగా శనివారంనాడు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపం వెలిగించబడింది.కాగా కార్తికమాసం ముగింపు వరకు కూడా ప్రతిరోజు ఈ దీపాన్ని వెలిగించడం జరుగుతుంది.ఆలయప్రధాన ధ్వజస్థంభానికి పై భాగమున ఈ ఆకాశదీపం నెలకొల్పబడుతుంది.



అదే విధంగా ప్రతిరోజు కూడా ధ్వజస్థంభం వద్ద ఈ ఆకాశదీపం వెలిగించడం జరుగుతుంది.కాగా ఈ సాయంత్రం ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించబడింది. అనంతరం దీపప్రజ్వలన,దీపారాధన జరిపించ బడుతుంది.ఈ ఆకాశదీపాన్ని వెలిగించినా, చూసినా సకల పాపాలు నశించి అనంతపుణ్యం కలుగుతుందని,వ్యాదులు తొలగి ఆయురారోగ్యాలు చేకురుతాయని చెప్పబడింది.

# విది నిర్వణలో కాదు సేవా దృర్పదములో.. అయనకు అయనే సాటి

**నంద్యాల, నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి**
పోలీసులు అంటే సహజంగా ఒక విదమైన దుస్ప్రరాము ఉంది. కాని ఇటీవల నంద్యాల ట్రాపిక్‌కు పదలీపై వచ్చిన సిఐ మురళీ అలాంటిని రూపుమాతు తన దైన శైలీలో విదులు నిర్వహించడమే కాకుండాసేవా దృర్పదములో అయనకు ఎవరు సాటి రారు అనే రీతిలో ముందుకు సాగుతున్నారు.వివరాలోకి వెళ్లితే ఇటీవల సాదారణ బదలీలో బాగంగా నంద్యాల ట్రాపిక్‌ను సిఐగా మల్లికార్జునగుప్తా రావడము జరిగింది. వచ్చిన వెంటనే నంద్యాలో ఎన్నో సంవత్సరాలుగా ట్రాపిక్ సమస్యతో అల్లాడుతున్న ఒకటవ పోలీసు స్టేషన్ ప్రాంతములో ట్రాపిక్ సమస్యలను క్షేదించారు. దీనితో నంద్యాల



ప్రజలు హర్శం వ్యక్తం చేస్తు పుస్కరాలకు ఒక సారి ఇలాంటి వారు వస్తుంటారని కొనియాడారు. ఇలాంటి తరుణంలో శుక్రవారము ఈయన కుమార్తె పుట్టిన రోజు కావడములో అమె పుట్టిన రోజు వేడుకలో ఏకంగా అనాదా బాలబాలికల మద్య గడిపి వారి మద్యన కేక్ కట్ చేశారు.అనంతరము వారికి వాటిని పంపిణీ చేసి వారికి వివిద సౌకర్యాలు కూడా కల్పించారు. సహజంగా పోలీసుల కుమార్తెల పుట్టిన రోజు వేడుకలు ఎంతో అర్బాటముగా రిచ్ హోటల్‌లో జరుపుకుంటారు కాని ఈయన మాత్రము సాదరణ అదికూడా అనాద బాలబాలికల మద్యన కేక్ కట్ చేసి వారికి అన్నదానము చేశాడు. అందుకే ఇలాంటి వారు పుస్కరాలకు ఒకరు వస్తారని అంటున్నారు.ఈకార్యక్రమంలో అనాద బాలిబాలికలు పోషిస్తున్న దంపతులు సుబ్బరాయుడు,రాజేశ్వరి, టీయర్లు సౌజన్య, వార్డన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.